www.bhadradrinews.com

# భద్రాద్రి న్యూస్

తెలుగు దినపత్రిక

Bhadradrinews Telugu Daily

హైదరాబాద్, సంపుటి : 4 సంచిక: 227, శుక్రవారం 18-9-2026 ఎడిటర్ : చెంగపాంగు సైదులు పేజీలు : 6 వేల : 5

Published from Khammam,Circulated by Hyderabad, Karimnagar, adilabad, Nizamabad, Warangal, Nalgonda, Mahabubnagar, Khammam

గణేష్ మండపం దగ్ధం



3లో..

అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో తెలంగాణ



4వ పేజీల్లో

ప్రజాపాలన దినోత్సవ వేడుకల్లో సీఎం రేవంత్

# ధిక్కారస్వరం వినిపించిన నేల.. తెలంగాణ



## తరతరాల అణిచివేత,దోపిడీ,పెత్తందారీ విధానాలపై తిరగబడిన ఆనాటి యోధులు

నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ప్రాణాలకు తెగించి పోరాడిన యోధులకు తెలంగాణ పుట్టినిల్లు. అస్థిత్వం, ఆత్మగౌరవం, హక్కుల కోసం ఈ నేల చైతన్యాన్ని రగిల్చింది. సమ్మక్క-సారలమ్మ పోరాటం నుంచి సాయుధ పోరాటం వరకు అన్యాయాన్ని ఎదిరించడం ఈ గడ్డ స్వభావం. సుదీర్ఘ పోరాట చరిత్రలో సెప్టెంబర్ 17కు ప్రత్యేక స్థానముంది. నిజాం పాలనలో హైదరాబాద్ ప్రపంచ స్థాయి గుర్తింపు పొందింది. అదే సమయంలో గ్రామీణ తెలంగాణలో భూస్వామ్య దోపిడీ, వెట్టిచాకిరి, అణచివేతలు.. చివరి దశలో ప్రజలను కల్లోల పరిచాయి. భారతదేశంలో అంతర్భాగం కావాలన్న ఆకాంక్ష ప్రజల్లో బలపడింది. రజాకారుల ఆగడాలకు వ్యతిరేకంగా భూమి, భుక్తి కోసం కమ్యూనిస్టులు పోరాడారు.- సీఎం రేవంత్

- నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ప్రాణాలకు తెగించి వీరులకు పుట్టినిల్లు మన రాష్ట్రం
- కృష్ణా నదీ జలాల్లో తెలంగాణ వాటా కోసం న్యాయ పోరాటం చేస్తున్నాం
- పెండింగ్ ప్రాజెక్టులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేస్తాం
- గన్‌పార్కు అమరవీరుల స్థూపం వద్ద సీఎం నివాళులు

హైదరాబాద్ :

తరతరాల అణచివేత, దోపిడీ, భూస్వామ్య, పెత్తందారీ విధానాలపై ధిక్కార స్వరం వినిపించిన నేల తెలంగాణ అని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ ప్రజల స్వేచ్ఛ, ఆత్మగౌరవం, హక్కుల కోసం పోరాడిన యోధులకు నివాళులర్పిస్తున్నట్లు తెలిపారు. నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ప్రాణాలకు తెగించి పోరాడిన యోధులకు పుట్టినిల్లు తెలంగాణ అని అభివర్ణించారు. అస్తిత్వం, ఆత్మగౌరవం, హక్కుల కోసం ఈ నేల ప్రజా చైతన్యాన్ని రగిలించిందని తెలిపారు. సెప్టెంబరు 17వ తేదీని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలన దినోత్సవంగా నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్‌లో సీఎం రేవంత్ రెడ్డి మిగతా 2లో..

## ఫ్యూచర్ సిటీలో ఎడ్యుకేషన్ హబ్‌ను తీర్చిదిద్దుతున్నాం



యూకే బిజినెస్ స్కూల్స్ బృందంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భేటీ

2లో..

# 2004 ఎన్నికల అఫిడవిట్‌లో కేసీఆర్‌కు ఎకరం భూమిలేదు

## నేడు ఇన్ని కోట్ల ఆస్తులు ఎలా వచ్చాయి?

- అంటే తప్పులు రాశారా?
- ఉద్యమకారుల త్యాగాల పునాదులపై లక్షల కోట్ల ఆస్తులు సంపాదించారు
- మంత్రి పొంగులేటి ధ్వజం



హైదరాబాద్ : బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఉద్యమకారులకు అప్పులే మిగిలాయని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఉద్యమకారులకు ఆస్తులు తగ్గితే.. కేసీఆర్‌కు రూ.లక్షల కోట్లు వచ్చాయని ఆరోపించారు. సీఎం రేవంత్, ప్రభుత్వంపై కేటీఆర్ విమర్శల నేపథ్యంలో పొంగులేటి స్పందించారు."2004 వరకు కేసీఆర్‌కు ఒక్క ఎకరా భూమి కూడా లేదు. ఎకరా భూమి కూడా లేదని ఆయన ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్నారు. కేసీఆర్‌కు ఇప్పుడు వేల కోట్ల ఆస్తులు ఉన్నాయి. ఎన్నికల అఫిడవిట్ ద్వారా కల్వకుంట్ల ముఠా అడ్డంగా దొరికింది. పుట్టుకతోనే కేసీఆర్‌కు వందల ఎకరాలు ఉన్నాయని కేటీఆర్ అంటున్నారు. అలాంటప్పుడు అఫిడవిట్‌లో తప్పులు రాశారా?లేకుంటే ప్రజలకు అబద్ధాలు చెబుతున్నారా? ఉద్యమకారుల త్యాగాల పునాదులపై రూ.లక్షల కోట్ల ఆస్తులు సంపాదించారు" అని పొంగులేటి ప్రశ్నించారు.

## కేసీఆర్ ఫాంహౌజ్ భూములపై విచారణ షురూ..

మాజీ సీఎం వ్యవసాయ క్షేత్రం పరిసరాల్లో ప్రభుత్వ భూముల వివరాలు సేకరణ



మర్కుక్ :కేసీఆర్ వ్యవసాయ క్షేత్రం పరిసరాల్లో ప్రభుత్వ భూముల వివరాలు సేకరిస్తున్నారు. సర్వే నెంబర్లు, గతంలో ఉన్న రైతుల పేర్లు, ప్రస్తుత రెవెన్యూ రికార్డులను అధికారులు పరిశీలిస్తున్నారు. నివేదికలు సిద్ధం చేస్తున్నారు. సిద్దిపేట జిల్లాలోని మర్కుక్ మండలం ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రంలో మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు సంబంధించిన భూముల వివరాలను రెవెన్యూ అధికారులు సిద్ధం చేస్తున్నారు. ఈ ఫామ్ హౌస్‌కు సమీపంలో ఉన్న ప్రభుత్వ మిగతా 2లో..

# జ్యుడీషియల్ విచారణకు సిద్ధం

**మీ,మా ఆస్తులపై విచారణ జరిపించండి కేసీఆర్‌పై సీఎం రేవంత్ విషప్రచారం**

**ఆయన చట్టప్రకారం కొనుగోలు చేసిన భూములపై సీఎం బురద చల్లుతున్నారు:కేటీఆర్**



హైదరాబాద్:

మాజీ సీఎం కేసీఆర్‌కు వెయ్యి ఎకరాల ఫామ్‌హౌస్ ఉందంటూ సీఎం రేవంత్‌రెడ్డి విష ప్రచారం చేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. కేసీఆర్‌కు 67 ఎకరాలు మాత్రమే ఉందని అసెంబ్లీ సాక్షిగా సీఎం అంగీకరించారని చెప్పారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. "ఇన్ని రోజులు విష ప్రచారం చేసినందుకు కేసీఆర్‌కు రేవంత్‌రెడ్డి క్షమాపణ చెప్పాలి. కేసీఆర్ పుట్టినప్పటి నుంచి మా కుటుంబ ఆస్తులెన్నో విచారణకు మేం సిద్ధం. రేవంత్ పుట్టినప్పుడు ఆయన ఆస్తులెన్ని.. ఇప్పుడు ఎన్నో విచారణకు సిద్ధమా? కేసీఆర్‌కు వ్యవసాయం అంటే మక్కువ. సీఎంగా ఉన్నా వ్యవసాయం చేశారు. రేవంత్‌లా భూమిని ఆయన ఆట వస్తువుగా చూడలేదు. చట్టప్రకారం కేసీఆర్ కొనుగోలు చేసిన భూములపై సీఎం బురద చల్లుతున్నారు. ఈ క్రమంలో రేవంత్ సెల్ఫ్ గోల్ వేసుకున్నారు. కేసీఆర్ తండ్రికి వందల ఎకరాలు ఉండేవి. అప్పట్లోనే కేసీఆర్ ఇల్లు రెండెకరాల్లో ఉండేది. చింతమడకలోని ఆ ఇంటిని కూడా ప్రభుత్వ స్కూల్‌కి ఇచ్చారు. ఎన్ని ఆరోపణలు చేసినా 22ఏ బాధితుల పక్షానే నిలబడతాం. ప్రభుత్వం చేసిన తప్పులను ప్రజాక్షేత్రంలో ఎండగడుతూనే ఉంటాం" అని కేటీఆర్ అన్నారు.

**కేసీఆర్ ఇల్లు రెండు ఎకరాల్లో ఉండేది**

కేసీఆర్ పుట్టినప్పుడే ఆయన ఇల్లు రెండు ఎకరాల్లో ఉండేది. కేసీఆర్ తండ్రికి వందల ఎకరాల భూమి ఉండేది. చింతమడకలో ఉన్న రెండెకరాల ఇంటిని కూడా ప్రభుత్వ పాఠశాలకు కేసీఆర్ రాసిచ్చారని గుర్తు చేశారు. గోడల మీద మిగతా 2లో..

# ఏసీబీకి పట్టుబడ్డ ఎస్ఐ, సీఐ..

**రూ.10లక్షలు డిమాండ్ చేసిన ఆంజనేయులు, జ్ఞానేందర్‌రెడ్డిని అదుపులోకి తీసుకున్న ఏసీబీ అధికారులు**



మేడ్చల్ మల్కాజిగిరి :

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కీసర పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం అర్ధరాత్రి వేళ ఏసీబీ సోదాలు సంచలనం రేపాయి. సీఐ ఆంజనేయులు, ఎస్సై జ్ఞానేందర్‌రెడ్డిని ఏసీబీ అధికారులు అరెస్ట్ చేశారు. వివరాల్లోకి వెళితే.. ఓ కేసు విషయంలో నిందితుడికి బెయిల్ ఇచ్చేందుకు సీఐ రూ.10 లక్షలు డిమాండ్ చేశారు. ఈ క్రమంలో నిందితుడితో పనిచేయించుకున్నారు. కొన్ని రోజులు బిర్యానీలు, కూల్‌డ్రింక్స్ తీసుకురావాలంటూ వేధింపులకు గురిచేశారు. ఆ వేధింపులు తట్టుకోలేకపోయిన బాధితుడు ఏసీబీని ఆశ్రయించాడు. మరోవైపు లంచం డబ్బు తీసుకునే బాధ్యతను ఎస్సైకు సీఐ అప్పగించారు. ఈ సమాచారంతో డీఎస్పీ మాజీద్ అలీఖాన్ ఆధ్వర్యంలో ఏసీబీ అధికారులు రంగంలోకి దిగారు.కీసర చెరువుగట్టు వద్ద నిమజ్జనం డ్యూటీలో ఉన్న ఎస్సై.. రూ. 5 లక్షలు లంచం తీసుకున్నాడు. అదే సమయంలో ఏసీబీ అధికారులు అక్కడికి రావడం చూసిన ఎస్సై అక్కడి నుంచి పరుగులు పెట్టాడు. కెమికల్ టెస్టులు చేయించుకోకుండా ముప్పుతిప్పలు పెట్టాడు. అనంతరం ఎస్సై జ్ఞానేందర్‌రెడ్డి, సీఐ ఆంజనేయులును ఏసీబీ అధికారులు అరెస్టు చేశారు.

# సెమీకండక్టర్ గ్లోబల్ హబ్‌గా భారత్

- కేవలం నాలుగేళ్లలోనే ఈ లక్ష్యాన్ని సాధించి చరిత్ర సృష్టించాం
- ఆవిష్కరణలు, పెట్టుబడులకు కొత్త అవకాశాలు రానున్నాయి
- ఈ రంగానికి యువతే కీలకం : మోదీ



న్యూఢిల్లీ:భారత సెమీకండక్టర్ రంగం రెండో దశలోకి అడుగుపెట్టిందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఈ స్థాయికి చేరుకోవడానికి ప్రపంచ దేశాలకు దశాబ్ద కాలం పట్టగా.. భారత్ మాత్రం కేవలం నాలుగేళ్లలోనే ఆ లక్ష్యాన్ని సాధించిందని తెలిపారు. సెమీకాన్ ఇండియా సమావేశంలో పాల్గొన్న సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు."కమర్షియల్ చిప్‌ల ఉత్పత్తికి అవసరమైన సామర్థ్యాన్ని పెంచుకునే దిశగా భారత్ వేగంగా అడుగులు వేస్తోంది. ఈ రంగంలో ప్రపంచ దేశాల నమ్మకాన్ని భారత్ సాధించింది. అంతర్జాతీయ భాగస్వామ్యాలతో సెమీకండక్టర్ విభాగంపై దేశ విశ్వాసం మరింత బలపడింది. ఈ రంగానికి యువతే కీలకం. మిగతా 2లో..



## ఎస్ఐ అభ్యర్థులకు రాత పరీక్ష నవంబర్ 29న..

**కానిస్టేబుల్ పోస్టులకు డిసెంబర్ 20న..**

హైదరాబాద్: పోలీసు ఉద్యోగాలకు రాత పరీక్ష తేదీలను తెలంగాణ రాష్ట్ర పోలీస్ నియామక మండలి (టీఎస్ఎల్‌పీఆర్‌బీ) విడుదల చేసింది. ఎస్ఐ అభ్యర్థులకు నవంబర్ 29న, మిగతా 2లో..



# కేంద్ర సర్కారు ఆధ్వర్యంలో సెప్టెంబర్ 17 ఆజాదీ

**మహనీయుల పోరాటాలు కొత్త తరానికి స్ఫూర్తి: ఉప రాష్ట్రపతి రాధాకృష్ణన్**

హైదరాబాద్:భారత్‌లో హైదరాబాద్ అంతర్భాగం కావడానికి ఎంతోమంది మహనీయుల బలిదానం కారణమని ఉప రాష్ట్రపతి రాధాకృష్ణన్ అన్నారు. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించిన తెలంగాణ విమోచన దినోత్సవంలో ఆయన మాట్లాడారు. తొలుత పోలీసు అమరవీరుల స్మృతి స్తూపం వద్ద ఉపరాష్ట్రపతి నివాళులర్పించారు. అనంతరం జాతీయ జెండాను ఎగురవేశారు. ఆ తర్వాత సర్దార్ వల్లభ్‌బాయ్ పటేల్ విగ్రహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉప రాష్ట్రపతి మాట్లాడుతూ హైదరాబాద్ విముక్తి కోసం పోరాడిన యోధులకు నివాళులర్పిస్తున్నట్లు చెప్పారు. మహనీయుల పోరాటాలు కొత్త తరానికి స్ఫూర్తిగా నిలు స్తాయన్నారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ శివప్రతాప్ శుక్లా, కేంద్రమంత్రులు గజేంద్ర సింగ్ షెకావత్, కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. అంతకుముందు సాయుధ బలగాల నుంచి ఉప రాష్ట్రపతి గౌరవవందనం స్వీకరించారు. విమోచన దినోత్సవం సందర్భంగా కళారూపాలు, వేయిస్తంభాల గుడి, బతుకమ్మ శకటాలను ప్రదర్శించారు.

**హైదరాబాద్-జోధ్‌పూర్‌కు మధ్య విడదీయరాని బంధం: షెకావత్**

హైదరాబాద్-జోధ్‌పూర్‌కు మధ్య విడదీయరాని బంధముందని కేంద్ర మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ అన్నారు. తెలంగాణ విమోచన దినోత్సవంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. తాను జోధ్‌పూర్ ప్రతినిధిగా ఇక్కడికి వచ్చానన్నారు. ఇక్కడ నిజాం కు వ్యతిరేకంగా అనేకమంది యోధులు పోరాటం చేశారన్నారు. స్వాతంత్ర్యం, స్వేచ్ఛ కోసం ఎంతో పోరాటం చేసి తెలంగాణను భారత్‌లో కలిపేందుకు కృషి చేశారన్నారు. అప్పట్లో నిజాంకు వ్యతిరేకంగా ఎంతోమంది వీరులు పోరాటం చేశారని గుర్తుచేశారు. మిగతా 2లో..

## భారత్‌పై 100 శాతం సుంకాల బిల్లుకు..

# అమెరికా ప్రతినిధుల సభ ఆమోదం





**ఇక ట్రంప్ సంతకమే తరువాయి**



వాషింగ్టన్:అమెరికా నుంచి భారత్‌కు కొత్త సుంకాల ముప్పు ఎదురుకావడం ఖాయంగా కనిపిస్తోంది. రష్యా నుంచి చమురు కొనుగోలు చేసే భారత్, చైనా వంటి దేశాలపై 100 శాతం సుంకాలు విధించేందుకు అధ్యక్షుడికి వీలు కల్పించే రష్యా మిగతా 2లో..

## రష్యా నుంచి చమురు కొనడం ఆపండి

ఆ దేశంపై ఆధారపడటం తగ్గించుకోకపోతే అసాధారణమైన ఆర్థిక ఆంక్షలు ఎదుర్కోవాల్సి వస్తుంది.. భారత్, చైనాలకు అమెరికా అల్టిమేటం..

2లో..

## భారతీయుల ఇంధన భద్రతకు కట్టుబడిఉన్నాం

అమెరికా ఆంక్షలు ఇరు దేశాల ద్వైపాక్షిక సంబంధాలను దెబ్బతీస్తాయి: కేంద్రం

## ప్రజల దృష్టిని మళ్లించేందుకే కేంద్రం

# కొత్త డ్రామా

**యూపీఐ లావాదేవీల ఛార్జీల వ్యవహారంపై కాంగ్రెస్ విమర్శలు**



న్యూఢిల్లీ :యూపీఐ లావాదేవీల ఛార్జీల వ్యవహారంపై బీజేపీ, కాంగ్రెస్ మధ్య తీవ్ర మాటల యుద్ధం నెలకొంది. రూ.2000లకు పైబడిన యూపీఐ చెల్లింపులపై ఛార్జీలు వసూలు చేసే నిర్ణయానికి పార్లమెంటు స్థాయీ సంఘంలో ఉన్న కాంగ్రెస్ ఎంపీలు మద్దతు పలికారన్న బీజేపీ వ్యాఖ్యలను హస్తం పార్టీ గురువారం ఖండించింది. యూపీఐ ఛార్జీలపై వెల్లువెత్తుతున్న ప్రజా వ్యతిరేకతను పక్కదారి పట్టించేందుకే మోదీ సర్కార్ దిగజారుడు ఆరోపణలు చేస్తోందని కాంగ్రెస్ నేతలు మండిపడ్డారు.యూపీఐ లావాదేవీలపై ఛార్జీలు వసూలు చేయాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని కాంగ్రెస్ అగ్రనేత, లోక్?సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్రంగా వ్యతిరేకించారు. అయితే ఆర్థిక వ్యవహారాల పార్లమెంటు స్థాయీ సంఘంలో ఉన్న కాంగ్రెస్ ఎంపీలు చిదంబరం, మనీశ్? తివారీ, గౌరవ్ గోగోయ్‌లు ఎండీఆర్ ఛార్జీలను సమర్థించారని, రాహుల్ ఎందుకు వ్యతిరేకిస్తున్నారని బీజేపీ నేతలు ప్రశ్నించారు. బీజేపీ చేస్తున్న ఈ వాదనలను గౌరవ్ గొగొయ్, మనీశ్ తివారీలు ఖండించారు. స్థాయీ సంఘం సమావేశంలో యూపీఐ ఛార్జీల ప్రతిపాదనపై ఎలాంటి చర్చ జరగలేదని మిగతా 2లో..

www.bhadradrinews.com
భద్రాద్రి న్యూస్
తెలుగు దినపత్రిక
Follow :
@bhadradrinews
శుక్రవారం
18 । సెప్టెంబర్ । 2026
www.bhadradrinews.com
epaper.bhadradrinews.com
ఖమ్మం,
భద్రాద్రి కొత్తగూడెం

## కేంద్ర సర్కారు ఆధ్వరంలో సెప్టెంబర్ 17 ఆజాదీ

సీఎం రేవంత్ రెడ్డి నిజాంను పొగడటం సిగ్గుచేటు అని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. తెలంగాణ విమోచన దినోత్సవంలో పాల్గొన్న ఆయన నిజాంలు అంత మంచివారైతే చాకలి ఐలమ్మ, దొడ్డి కొమురయ్య, మల్లు స్వరాజ్యం, రావి నారాయణరెడ్డి వారిపై ఎందుకు పోరాటం చేశారో రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలన్నారు. నిజాం పాలన పోయినా నిజాం వారసత్వమైన మజ్లీస్ పార్టీ ఇంకా అరాచకాలు సృష్టిస్తోందన్నారు. 1980 నుంచి తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని బీజేపీ డిమాండ్ చేసిందని, గత ఐదేళ్లుగా కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకలను అధికారికంగా నిర్వహిస్తున్నామన్నారు. 2029లో గ్రామగ్రామాన ఈ వేడుకలను అధికారికంగా నిర్వహిస్తామన్నారు.

## జ్యుడీషియల్ విచారణకు సిద్ధం

పెయింట్ వేసుకునే నీకు జూబ్లీహిల్స్‌లో ప్యాలెస్ ఉండొచ్చు కానీ.. కేసీఆర్‌కు వ్యవసాయం చేసుకోవడానికి భూమి ఉండొద్దా అని ప్రశ్నించారు. కేసీఆర్‌కు మొదటినుండే వందల ఎకరాలు ఉన్నాయి. కేసీఆర్ దొర అంటావా, లేక ఈ మధ్య సంపాదించు కున్నాడు అంటావా? ఏదో ఒకటి ఫిక్స్ అవ్వు రేవంత్ రెడ్డి అని సూచించారు. నేను అమెరికాలో ఆరున్నర సంవత్సరాలు ఉద్యోగం చేసి సంపాదించుకున్నాను. నువ్వు ఏమీ చేసి సంపాదించావు రేవంత్ రెడ్డి? అని నిలదీశారు.

## ప్రజల దృష్టిని మళ్లించేందుకే కేంద్రం కొత్త డ్రామా

గౌరవ్ గొగొయ్ స్పష్టం చేశారు. 'ఆర్థిక సంఘం సభ్యులతో సమావేశమైనప్పుడు 'యూపీఐ పన్ను'కు సంబంధించి ఎటువంటి నిర్దిష్ట ప్రతిపాదు. అయితే, ఈ విధానాలు చిన్న వ్యాపారులకు, పారిశ్రామికవేత్తలకు తీవ్ర నష్టం కలిగించి, అమెరికన్ వంటి కార్పొరేట్ సంస్థలకు లాభం చేకూరుస్తాయి' అని గొగొయ్ ఆరోపించారు. అమెరికన్ కంపెనీలను, డొనాల్డ్ ట్రంప్ ని తృప్తిపరచడానికి ఈ యూపీఐ ఛార్జీల నిర్ణయం తీసుకున్నారని జైరాం రమేశ్? విమర్శించారు. అలాగే, యూపీఐ ఛార్జీలపై వస్తున్న వ్యతిరేకత నుంచి ప్రజల దృష్టి మళ్లించడానికి కేంద్రం తీవ్ర ప్రయత్నాలు చేస్తోందని ఆయన పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, కాంగ్రెస్ ఎంపీ మనీశ్ తివారీ కూడా యూపీఐ ఛార్జీల విషయంపై ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ఎండీఆర్ రేట్లు, ఫీజులు, శ్లాబుల గురించి కమిటీ ముందుకు ఎలాంటి నిర్దిష్ట ప్రతిపాదన రాలేదని ఎంపీ మనీశ్ తివారీ చెప్పారు. అత్యంత రహస్యంగా ఉంచాల్సిన పార్లమెంటరీ స్టాండింగ్? కమిటీ చర్చలను ప్రభుత్వం రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకోవడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. ఎండీఆర్? ఛార్జీల రేటు, దాని పనితీరు వంటి అంశాలపై కమిటీలోని కొంతమంది సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారని చెప్పారు.

ఎండీఆర్ అఖిలేశ్ యాదవ్ ధ్వజం

యూపీఐ లావాదేవీలపై విధించే ఎండీఆర్ ఛార్జీలపై సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ కూడా తీవ్ర విమర్శలు గుప్పించారు. గతంలో భారత్‌ను ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మారుస్తామని చెప్పిన ప్రభుత్వం, ఇప్పుడు ప్రజల రోజువారీ లావాదేవీల నుంచి డబ్బులు వసూలు చేయాలని చూస్తోందని ఆరోపించారు. ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అంతకుముందు ఎక్స్ పోస్ట్‌లో అఖిలేశ్ యాదవ్ ఇలా అన్నారు. "ఇతరుల సంపాదన నుంచి లాభం పొందాలనే ప్రయత్నంలో భాగంగా, బీజేపీ ఇప్పుడు జఖఎ చెల్లింపులపై రుసుములు వసూలు చేస్తోంది. ఇలాంటి విధానంతో ఎలాంటి ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థను నిర్మించగలరు?" అని ఎద్దేవా చేశారు. కాగా, ఆర్థిక వ్యవహారాల స్టాండింగ్ కమిటీ సమావేశంలో కొందరు ప్రతిపక్ష ఎంపీలు ఈ ఛార్జీలను వ్యతిరేకించారని ఛైర్మన్ భర్తృహరి మెహతాబ్ తెలిపారు. బుధవారం నాటి సమావేశంలో యూపీఐ అంశం లేకపోయినా కొందరు ఎంపీలు ప్రస్తావించారని పేర్కొన్నారు. మరో నెలలో కొత్త కమిటీ ఏర్పడుతుందని, అప్పుడు ఈ అంశంపై చర్చిస్తారని ఆయన స్పష్టం చేశారు.

## సెమీకండక్టర్ గ్లోబల్ హబ్‌గా భారత్

వారి నైపుణ్యాలను మెరుగుపరచడంపైనే భారత్ ప్రత్యేక దృష్టి సారించింది. చిప్‌ల డిజైన్, తయారీలో యువతకు తగిన శిక్షణ ఇస్తున్నాం. సెమీకండక్టర్ లక్ష్యాలను నెరవేర్చడంలో వారే కీలకం" అని మోదీ అన్నారు. ఇటీవల జరిగిన బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు కూడా భారత్‌పై ప్రపంచ దేశాల విశ్వాసాన్ని ప్రతిబింబించిందని ఆయన గుర్తు చేశారు. సెమీకండక్టర్ ఇండియా-2026 ఈవెంట్ దిల్లీలో సెప్టెంబర్ 17 నుంచి 19 వరకు కొనసాగనుంది. 52 దేశాల నుంచి 600 పైగా కంపెనీలు ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నాయి.

## ఎస్ఐ అభ్యర్థులకు రాత పరీక్ష నవంబర్ 29న..

కానిస్టేబుల్ పోస్టులకు డిసెంబర్ 20న రాత పరీక్ష నిర్వహించనున్నట్టు గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. హోంశాఖ పరిధిలోని పోలీస్, స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (ఎస్‌పీఎఫ్), అగ్నిమాపక, జైళ్ల శాఖల్లో 7,437 పోస్టుల భర్తీ కోసం నోటిఫికేషన్లు జారీ చేసిన విషయం తెలిసిందే. పోలీసు ఉద్యోగాలకు రాష్ట్ర వ్యాప్తంగా 5,77,064 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నట్టు తెలంగాణ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ ఛైర్మన్ వి.వి శ్రీనివాసరావు తెలిపారు. ఇందులో ఎస్ఐ పోస్టులకు 1,60,756 మంది, కానిస్టేబుల్ పోస్టులకు 3,89,356 మంది దరఖాస్తు చేసుకున్నట్టు వివరించారు.

## గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు.. ఓటరు జాబితా షెడ్యూల్ విడుదల

హైదరాబాద్:

తెలంగాణలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు జాబి తా షెడ్యూల్ విడుదలైంది. మహబూబ్‌నగర్-రంగారెడ్డి- హైదరాబాద్, వరంగల్-ఖమ్మం- నల్గొండ ఎమ్మెల్సీ నియోజకవర్గాల ఓటరు జాబితాను ఈసీ విడుదల చేసింది. పట్టభద్రుల ఓట్ల నమోదు కోసం ఈ నెల 20న ఎన్నికల కమిషన్ పబ్లిక్ నోటీసు ఇవ్వనుంది. నవంబరు 6 వరకు ఓటరు దరఖాస్తులు స్వీకరించనుంది. నవంబరు 25న ముసాయిదా ఓటరు జాబితా విడుదల చేయనుంది. నవంబరు 25 నుంచి డిసెంబరు 10 వరకు అభ్యంతరాలు స్వీకరించనుంది. డిసెంబరు 30న పట్టభద్రుల తుది ఓటర్ల జాబితా విడుదల చేయనున్నారు. గతంలో ఓటున్న వారు కూడా మళ్లీ కొత్తగా దరఖాస్తు చేసుకోవాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి(సీఈవో) తెలిపారు. మార్చిలో ఎమ్మెల్సీలు వాణిదేవి, తీన్మార్ మల్లన్న పదవీ కాలం ముగియనుంది. రాష్ట్రంలో రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాల్లో ఎన్నికలకు ఈసీ కసరత్తు చేపట్టింది. మహబూబ్‌నగర్-హైదరాబాద్- రంగారెడ్డితో పాటు వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల నియో జకవర్గాల్లో ఓటర్ల జాబితా తయారీకి షెడ్యూలు ప్రకటించింది. ఎమ్మెల్సీలు వాణిదేవి, తీన్మార్ మల్లన్న పదవీకాలం మార్చితో ముగియనుండటంతో ఆ స్థానాల్లో ఎన్నికలు నిర్వహించేందుకు కొత్తగా ఓటర్ల జాబితా తయారు చేయనున్నారు.

డిసెంబర్ 30న తుది ఓటర్ల జాబితా

ఈనెల 28న పట్టభద్రుల ఓట్ల నమోదు కోసం ఎన్నికల కమిషన్ పబ్లిక్ నోటీసు ఇవ్వనుంది. నవంబరు 6 వరకు ఓటు నమోదు కోసం పట్టభద్రుల నుంచి ఫారం 8 దరఖాస్తులు స్వీకరిస్తారు. నవంబరు 25న రెండు నియోజకవర్గాల్లో ముసాయిదా ఓటరు జాబితా ప్రచురిస్తారు. నవంబరు 25 నుంచి డిసెంబరు 10 వరకు ముసాయిదా జాబితాపై అభ్యంతరాలు, క్లెయిమ్‌లను స్వీకరిస్తారు. డిసెంబరు 30న పట్టభద్రుల ఓటర్ల తుది జాబితాను ఈసీ ప్రకటించనుంది. గత జాబితాలో ఓటున్న పట్టభద్రులు కూడా మళ్లీ కొత్తగా ఫారం 8 సమర్పించాల్సిందేనని ఎన్నికల కమిషన్ స్పష్టం చేసింది. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో లేదా పోస్టుద్వారా అర్హత ధ్రువీకరణపత్రాలు పంపాలన్నారు.

## ధిక్కార స్వరం వినిపించిన నేల తెలంగాణ



జాతీయ జెండా ఆవిష్కరించారు. అంతకు ముందు గన్‌పార్కులో అమరవీరుల స్థూపం వద్ద నివాళు లర్పించారు. సమ్మక్క-సారలమ్మ పోరాటం నుంచి సాయుధ పోరాటం వరకు అన్యాయాన్ని ఎదిరించడం ఈ తెలంగాణ గడ్డ స్వభావమని సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. సుదీర్ఘ పోరాట చరిత్రలో సెప్టెంబర్ 17కు ప్రత్యేక స్థానం ఉందని, నిజాం పాలనలో హైదరాబాద్ ప్రపంచ స్థాయి గుర్తింపు సాధించిందన్నారు. అదే సమయంలో గ్రామీణ తెలంగాణలో భూస్వామ్య దోపిడీ, వెట్టిచాకిరీ, అణచివేతలు చివరి దశలో రజాకార్ల దౌర్జన్యాలు ప్రజలను కల్లోల పరిచాయని గుర్తు చేశారు. భారతదేశంలో అంతర్భాగం కావాలన్న ఆకాంక్ష ప్రజల్లో బలపడిందని, నిజాం ఆంధ్ర మహాసభ, హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఉద్యమాలు రగిలాయని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. రజాకార్ల ఆగడాలకు వ్యతిరేకంగా భూమి, భుక్తి కోసం కమ్యూనిస్టులు పోరాటం చేశారని అన్నారు. రావి నారాయణ రెడ్డి, భీంరెడ్డి నర్సింహా రెడ్డి, చాకలి ఐలమ్మ వంటి యోధులు పోరాటాలకు నాయకత్వం వహించడం గొప్ప విషయమన్నారు. హైదరాబాద్ ప్రజల ఆకాంక్ష మేరకు నెహ్రూ, పటేల్ నాయకత్వంలో సైనిక చర్య చేపట్టారని వివరించారు. తరతరాల అణచివేత, దోపిడీ, భూస్వామ్య, పెత్తందారీ విధానాలపై ధిక్కార స్వరం వినిపించిన నేల తెలంగాణ. నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ప్రాణాలకు తెగించి పోరాడిన యోధులకు పుట్టినిల్లు తెలంగాణ. అస్తిత్వం, ఆత్మ గౌరవం, హక్కుల కోసం ఈ నేల ప్రజా చైతన్యాన్ని రగిలించింది. సమ్మక్క-సారలమ్మ పోరాటం నుంచి సాయుధ పోరాటం వరకు అన్యాయాన్ని ఎదిరించడం ఈ గడ్డ స్వభావం.

అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.

రాచరిక పాలన నుంచి ప్రజాస్వామ్య పాలన

ఆపరేషన్ పోలో అనంతరం ఏడో నిజాం మీర్ ఉస్మాన్ అలీఖాన్ భారత ప్రభుత్వానికి లొంగిపోయినట్లు సీఎం తెలిపారు. 1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్ అధికారికంగా భారత్‌లో అంతర్భాగమైందన్నారు. రాచరిక పాలన నుంచి ప్రజాస్వామ్య పాలనకు మార్గం తెరుచుకున్న చారిత్రక సందర్భం సెప్టెంబరు 17వ తేదీ అని గుర్తుచేశారు. సెప్టెంబర్ 17ను ప్రజాపాలన దినోత్సవంగా జరుపుకుంటున్నామన్న సీఎం రేవంత్ రెడ్డి, ప్రజల ఆత్మగౌరవానికి పట్టం కడుతూ ప్రజాపాలన కొనసాగిస్తున్నామని తెలిపారు. తెలంగాణ పొరుగు రాష్ట్రాలతో కాకుండా ప్రపంచంతో పోటీపడుతోందని చెప్పారు. రాష్ట్ర తలసరి ఆదాయం రూ.4.18 లక్షలుగా ఉందని, దేశ తలసరి ఆదాయం కంటే 91 శాతం ఇది అధికమని అన్నారు.

2.25 లక్షల మందికి కొత్త పింఛన్లు

కృష్ణా నదీ జలాల్లో తెలంగాణ వాటా కోసం న్యాయ పోరాటం చేస్తున్నామని, పెండింగ్ ప్రాజెక్టులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి తెలంగాణను సస్యశ్యామలం చేస్తామని సీఎం చెప్పారు. తెలంగాణలో ప్రతి ఆడబిడ్డ సగర్వంగా జీవించాలని, ఆర్థిక స్వావలంబన సాధించాలనేది తమ ప్రభుత్వ ఆలోచన అని అన్నారు. 1.06 కోట్ల కుటుంబాలకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ, 2.25 లక్షల మందికి పింఛన్లు ఇచ్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ప్రకటించారు. ప్రతి కుటుంబం ఆత్మ గౌరవంతో జీవించాలనేది తమ ప్రభుత్వ ఆశయమన్నారు. హైదరాబాద్ పరిధిలో లక్ష ఇందిరమ్మ ఇళ్ల టవర్స్ నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లులను రాష్ట్రపతి ఆమోదానికి పంపినట్లు గుర్తు చేశారు.

## కేసీఆర్ ఫాంహౌజ్ భూములపై విచారణ షురూ..

భూముల సర్వే నెంబర్లు, గతంలో ఉన్న రైతుల పేర్లు, ప్రస్తుత రికార్డులను రెవెన్యూ అధికారులు నివేదికల రూపంలో తయారు చేస్తున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీ వేదికగా కేసీఆర్ ఫామ్‌హౌస్‌పై విచారణకు ఆదేశించిన విషయం విదితమే. ఈ క్రమంలో ఎర్రవల్లి ఫామ్‌హౌస్?పై అధికారులు దృష్టి సారించారు. ఈ నేపథ్యంలోనే ఆర్డీవో చంద్రకళ క్షేత్రస్థాయిలో ప్రభుత్వ భూమిని పరిశీలించారు. మర్కూక్ తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులను తనిఖీ చేశారు. ఎర్రవల్లిలోని సర్వేనంబర్ 325లో ప్రభుత్వ భూములను పరిశీలించారు. మాజీ సీఎం కేసీఆర్ ఫామ్‌హౌస్‌పై సీఎం రేవంత్ రెడ్డి విచారణకు ఆదేశించిన విషయం తెలిసిందే. కేసీఆర్ ఫామ్?హౌస్?లో 295 ఎకరాల భూమి ఉందని సీఎం అసెంబ్లీ సమావేశాల సందర్భంగా వివరించారు. కేసీఆర్ కుటుంబ ఆస్తులకు సంబంధించిన వివరాలను ఆయన వెల్లడించారు. గత ప్రభుత్వంలో అక్రమంగా ఆస్తులు సంపాదించారని సీఎం ఆరోపించారు. 700 ఎకరాల ఫామ్‌హౌస్ కేసీఆర్‌కు ఉందా లేదా తేల్చాలని ఆయన ఆదేశించారు. 388 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని కేసీఆర్ ఎందుకు చెప్పలేదని రేవంత్ రెడ్డి నిలదీశారు. ఫామ్‌హౌస్‌లోని ప్రభుత్వ భూమిని పేదలకు పంచిపెడతానని, శుద్ధి చేసిన చోటే దళితులకు భూములిచ్చి యజమానులను చేస్తానని రేవంత్ రెడ్డి చెప్పారు.



## ఫ్యూచర్ సిటీలో ఎడ్యుకేషన్ హబ్‌ను తీర్చిదిద్దుతున్నాం

హైదరాబాద్:

ప్రపంచ ప్రఖ్యాత 'హార్వర్డ్ యూనివర్సిటీ' హైదరాబాద్‌లో ఔత్సాహికులకు ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ కోర్సులను డిసెంబర్ నుంచి అందించనున్నట్టు గౌరవ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తెలిపారు. తెలంగాణను 'గ్లోబల్ నాలెడ్జ్ హబ్'గా తీర్చిదిద్దే దిశగా తెలంగాణ ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోందని యూకే బిజినెస్ స్కూల్స్ బృందం భేటీలో అన్నారు. ఎంసీఆర్ హెచ్ ఆర్డీలో నిర్వహించిన భేటీలో యూకే హౌస్ ఆఫ్ లార్డ్స్ సభ్యుడు కరణ్ బిలిమోరియా, బ్రిటిష్ కౌన్సిల్ డైరెక్టర్ జనక పుష్పనాథన్, చార్టర్డ్ అసోసియేషన్ ఆఫ్ బిజినెస్ స్కూల్స్ సీఈఓ ఫ్లోరా హామిల్టన్, బ్రిటిష్ డిప్యూటీ హైకమిషనర్ ప్రతినిధులతో సహా 30 మంది వివిధ యూకే యూనివర్సిటీ ప్రతినిధులతో సీఎం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వివిధ యూకే బిజినెస్ స్కూల్స్ కు సంబంధించిన డీన్లు, ఉన్నత స్థాయి అధికారులతో చర్చిస్తూ, విశ్వవిద్యాలయాలకు అవసరాలకు తగ్గట్టు అన్ని రకాలుగా రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. ఎంఐటీ, పర్డ్యూ వంటి పలు ఐవీ లీగ్ యూనివర్సిటీలు హైదరాబాద్ లో ఆఫ్ షోర్ క్యాంపస్ ఏర్పాటు ప్రక్రియ మొదలైందన్నారు. విదేశీ విద్యాసంస్థల రాకతో స్థానిక విశ్వవిద్యాలయాలు, పరిశ్రమలతో కలిసి పనిచేయడానికి, ఇక్కడే పరిశోధనలు చేపట్టడానికి దోహదపడుతుందన్నారు. యూకే బిజినెస్ స్కూల్స్ తెలంగాణలో ఏర్పాటైతే ప్రపంచ స్థాయి కార్పొరేట్ వ్యాపార సంస్థలు రాష్ట్రం వైపు చూస్తాయని అన్నారు. అదే సమయంలో రాష్ట్ర విద్యార్థులు, అధ్యాపకులకు అంతర్జాతీయ సంస్థలు, అంతర్జాతీయ అనుభవం, ప్రపంచ స్థాయి అవకాశాలు అందుబాటులో ఉంటాయన్నారు. ఈ దిశగా హార్వర్డ్, ఎంఐటి, లండన్ విశ్వవిద్యాలయం, వర్జీనియా టెక్, నార్త్‌ఈస్టర్న్ విశ్వవిద్యాలయం వంటి అనేక ప్రముఖ అంతర్జాతీయ విశ్వవిద్యాలయాలతో ఎగ్జిక్యూటివ్ ప్రోగ్రామ్‌లు, డ్యూయల్ డిగ్రీ కోర్సులు, అధ్యాపకుల శిక్షణ, పరిశోధన వంటి రంగాల్లో భాగస్వామ్యాలు ప్రారంభించవచ్చున్నారు. అలాగే విద్యార్థులకు ఇంగ్లీష్, జర్మన్, జపనీస్ వంటి విదేశీ భాషా నైపుణ్యాలను పెంపొందించేందుకు కూడా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. మారుతున్న మార్కెట్ అవసరాలకు అనుగుణంగా యువతకు అత్యాధునిక నైపుణ్య శిక్షణ అందించేందుకు భారత్ ఫ్యూచర్ సిటీలో యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తున్నట్టు వివరించారు. అత్యంత ప్రతిష్టాత్మకంగా అభివృద్ధి చేస్తున్న భారత్ ఫ్యూచర్ సిటీని దాదాపు 30,000 ఎకరాల విస్తీర్ణంలో, దేశంలోనే మొట్టమొదటి నెట్-జీరో గ్రీన్‌ఫీల్డ్ స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దుతున్నామన్నారు. అక్కడ ఎడ్యుకేషన్ హబ్ ఏర్పాటుతో భావితరాలకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని చెప్పారు. డిసెంబర్ లో అక్కడ నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ 2026కు బృందానికి ఆహ్వానం పలికారు. యూకే విద్యా వ్యవస్థలో ముఖ్యులందరికీ గ్లోబల్ సమ్మిట్ కు ప్రత్యేకంగా ఆహ్వానించనున్నట్టు వివరించారు. దావోస్ లో నిర్వహించే వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ తరహాలో ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ ను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నామన్నారు. ఫ్యూచర్ సిటీలో భారీ పెట్టుబడులు పెట్టేందుకు ప్రపంచ అగ్రగామి సంస్థలు ముందుకొస్తున్నాయి. టీసీఎస్ 70 వేల కోట్లతో దేశంలోనే అతిపెద్ద ఏఐ డేటాసెంటర్ నిర్మించనుంది. లక్ష కోట్ల పెట్టుబడితో అమెజాన్ ఇప్పటికే డేటాసెంటర్ నిర్మాణం చేపట్టిందన్నారు. ప్రపంచంలోనే మేటి విశ్వ విద్యాలయాలు, ఫార్చ్యూన్-500 కంపెనీలు తెలంగాణాలో ఉండే విధంగా అడుగులు వేస్తున్నామన్నారు. నర్సరీ నుంచి ఉన్నత విద్య వరకు, అలాగే ఐటీఐలు, పాలిటెక్నిక్ కాలేజీలు, స్కిల్స్ యూనివర్సిటీల ద్వారా యువతలో నైపుణ్యాలను పెంపొందించడం, తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు, యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ వంటి వాటి ద్వారా విద్యా వ్యవస్థను సమూలంగా మార్చడమే ప్రభుత్వ ఉద్దేశమని వివరించారు. 2047 నాటికి తెలంగాణను మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలన్న లక్ష్యం గురించి ప్రస్తావించారు.

## స్టేషన్ బెయిల్‌కు లంచం.. రూ.10 లక్షలు

### డిమాండ్ చేసిన కీసర సీఐ, ఎస్సై అరెస్ట్

కీసర :

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కీసర పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం అర్ధరాత్రి వేళ ఏసీబీ సోదాలు సంచలనం రేపాయి. సీఐ ఆంజనేయులు, ఎస్సై జ్ఞానేందర్‌రెడ్డిని ఏసీబీ అధికారులు అరెస్ట్ చేశారు. వివరాల్లోకి వెళితే.. ఓ కేసు విషయంలో నిందితుడికి బెయిల్ ఇచ్చేందుకు సీఐ రూ.10 లక్షలు డిమాండ్ చేశారు. ఈ క్రమంలో నిందితుడితో పనిచేయించుకున్నారు. కొన్ని రోజులు బిర్యానీలు, కూల్‌డ్రింక్స్ తీసుకురావాలంటూ వేధింపులకు గురిచేశారు. ఆ వేధింపులు తట్టుకోలేకపోయిన బాధితుడు ఏసీబీని ఆశ్రయించాడు. మరోవైపు లంచం డబ్బు తీసుకునే బాధ్యతను ఎస్సైకు సీఐ అప్పగించారు. ఈ సమాచారంతో డీఎస్పీ మాజీద్ అలీఖాన్ ఆధ్వర్యంలో ఏసీబీ అధికారులు రంగంలోకి దిగారు. కీసర చెరువుగట్టు వద్ద నిమజ్జనం డ్యూటీలో ఉన్న ఎస్సై.. రూ. 5 లక్షలు లంచం తీసుకున్నాడు. అదే సమయంలో ఏసీబీ అధికారులు అక్కడికి రావడం చూసిన ఎస్సై అక్కడి నుంచి పరుగులు పెట్టాడు. కెమికల్ టెస్టులు చేయించుకోకుండా ముప్పుతిప్పలు పెట్టాడు. అనంతరం ఎస్సై జ్ఞానేందర్‌రెడ్డి, సీఐ ఆంజనేయులును ఏసీబీ అధికారులు అరెస్టు చేశారు.

## యూట్యూబర్ వైష్ణవి భర్త దారుణహత్య

నిజామాబాద్ :

యూట్యూబర్ వైష్ణవి హత్యకేసు లో నిందితుడు, ఆమె భర్త చిత్త రి హరిబాబు(26) నిజామాబా ద్ నగరంలో దారుణ హత్యకు గురయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గత కొన్ని రోజులుగా హరిబా బు తన తల్లితో కలిసి నిజా మాబాద్ ఐదో ఠాణా పరిధిలోని ఇంద్రాపూర్లో నివాసం ఉంటున్నాడు. రాజరాజేంద్ర చౌరస్తాలో మక్కబుట్టలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నారు. రోజులాగే గురువారం మక్కబుట్టలు అమ్ముకుంటున్న క్రమంలో.. దాహం వేసి నీళ్ల కోసం పక్కనే ఉన్న చాట్‌బండి వద్దకు వెళ్లాడు. అదే సమయంలో ఓ కారులో గుర్తుతెలియని వ్యక్తులు వచ్చి ఆయన తలపై పదునైన ఆయుధంతో విచక్షణారహితంగా దాడి చేశారు. తీవ్రగాయాలపాలైన హరిబాబు అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు. కారులో ముగ్గురు వ్యక్తులు ఉండగా... ఓ వ్యక్తి వచ్చి పదునైన ఆయుధంతో తలపై నరికిన దృశ్యాలు సీసీ కెమెరాల్లో నమోదయ్యాయి. నిందితుడు 10 సెకన్లలో 9 సార్లు కత్తితో నరికిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం మాదాపూర్ గ్రామానికి చెందిన వైష్ణవి (19), కోరుట్ల పట్టణం ఏసుకోనిగుట్టకు చెందిన చిత్తరి హరిబాబు(26)కి వివాహం జరిగింది. నాలుగు నెలల గర్భిణిగా ఉన్న వైష్ణవి గొంతు నులిమి, చేతులు, నుదిటిపై కత్తితో పొడిచి హత్య చేసినట్లు హరిబాబుపై ఆరోపణలున్నాయి. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు హరిబాబును అరెస్టు చేశారు. ప్రస్తుతం బెయిల్‌పై జైలు నుంచి బయటికొచ్చిన నిందితుడు ఇవాళ దారుణహత్యకు గురయ్యాడు.

## భారత్‌పై 100 శాతం సుంకాల బిల్లుకు.. అమెరికా ప్రతినిధుల సభ ఆమోదం

ఆంక్షల బిల్లుకు ప్రతినిధుల సభలో ఆమోదం లభించింది. 262-159 ఓట్ల తేడాతో బిల్లు పాస్ అయింది. ఆగస్టులోనే సెనెట్ ఈ బిల్లును ఆమోదించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దీనిపై సంతకం చేయడమే తరువాయి. దివంగత సెనెటర్ లిండ్సే గ్రాహమ్ పేరు మీదుగా శాంక్షనింగ్ రష్యా ఇరాన్ యాక్ట్ 2026ను తీసుకువచ్చిన సంగతి తెలిసిందే. ఉక్రెయిన్‌తో జరుగుతున్న యుద్ధాన్ని ముగించేలారష్యాపై ఒత్తిడి పెంచడమే ఈ బిల్లు ప్రధాన లక్ష్యం. అప్పట్లో దీనిని ట్రంప్ ఆర్థిక బంకర్ బస్టర్‌గా అభివర్ణించారు. రష్యా అధికారులు, ఆర్థిక సంస్థలు, ఇంధన ప్రాజెక్టులు లక్ష్యంగా ఈ బిల్లును రూపొందించారు. దీనికింద ఆంక్షల నుంచి తప్పించుకుంటూ రష్యా చమురును అంతర్జాతీయ మార్కెట్లకు తరలించే రహస్య నౌకలపై కఠిన చర్యలు తీసుకుంటారు. ఇరాన్ ఇంధన, ఆయుధ రంగానికి నిధులు అందకుండా గతంలో ఉన్న ఆంక్షలను 2031 వరకు పొడిగించారు. రష్యా నుంచి అత్యధికంగా ముడి చమురు, సహజ వాయువును కొనుగోలు చేసే దేశాలపై గరిష్టంగా 100% వరకు పెనాల్టీ సుంకాలు విధించే అసాధారణ అధికారం ట్రంప్‌నకు లభించనుంది. ప్రస్తుతం రష్యా చమురును ప్రపంచంలోనే అత్యధికంగా కొనుగోలు చేస్తున్న దేశాల్లో చైనా మొదటి స్థానంలో ఉండగా, భారత్ రెండో స్థానంలో ఉంది. ఇప్పుడు ఈ బిల్లు అధ్యక్షుడి సంతకంతో చట్టరూపం దాల్చిన తర్వాత కూడా రష్యా నుంచి భారత్ చమురు కొనుగోళ్లు కొనసాగిస్తే.. భారత్ నుంచి అమెరికాకు ఎగుమతి అయ్యే వస్తువులపై ట్రంప్ సర్కార్ 100 శాతం వరకు అదనపు పన్నులు విధించే ముప్పు పొంచి ఉంది.

## భారతీయుల ఇంధన భద్రతకు కట్టుబడిఉన్నాం

### అమెరికా ఆంక్షలు ఇరు దేశాల ద్వైపాక్షిక సంబంధాలను దెబ్బతీస్తాయి

### 100% టారిఫ్ ముప్పుపై కేంద్రం స్పందన

న్యూఢిల్లీ:రష్యా నుంచి చమురు కొనుగోలు చేసే దేశాల ఎగుమతులపై 100 శాతం టారిఫ్‌లకు వీలుకల్పించే బిల్లుకు అమెరికా చట్టసభల్లో ఆమోదం లభించింది. దీనిపై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంతకం చేస్తే.. భారత్‌పై నూరుశాతం సుంకాలు పడే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం స్పందించింది. ఈ ఆంక్షల బిల్లును ఎప్పటికప్పుడు గమనిస్తున్నామని వెల్లడించింది. "గతంలో చెప్పినట్టుగానే భారత్ తన 140 కోట్లమంది ప్రజలకు ఇంధన భద్రతను కల్పించడానికి కట్టుబడి ఉంది. మారుతున్న మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా వేర్వేరు వనరుల నుంచి ఇంధన దిగుమతులను కొనసాగిస్తాం. రష్యాతో చమురు వాణిజ్యం అంశంపై అమెరికా ప్రతినిధులతో ఇప్పటికే చర్చించాం. ద్వైపాక్షిక సంబంధాలపై మాత్రమే కాకుండా అంతర్జాతీయ ఇంధన మార్కెట్ల స్థిరత్వంపై కూడా ఈ బిల్లు ప్రభావం చూపించే అవకాశం ఉందని స్పష్టంగా తెలియజేశాం. భారత వాణిజ్య, ఆర్థిక ప్రయోజనాలను పరిరక్షించుకోవడానికి అవసరమైన అన్ని చర్యలను భారత ప్రభుత్వం తీసుకుంటుందని యూఎస్‌కు ఇప్పటికే చెప్పాం. ఈ బిల్లు చట్టరూపం దాల్చితే భారత వాణిజ్యంపై పడే ప్రభావాలను ఎదుర్కొనేందుకు సంబంధిత సంస్థలతో కలిసి పనిచేస్తున్నాం" అని కేంద్ర విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో వెల్లడించింది. అమెరికా తీసుకుంటున్న ఇలాంటి చర్యలు ఇరుదేశాల ద్వైపాక్షిక సంబంధాలను దెబ్బతీస్తాయని తాము ముందుగానే వాషింగ్టన్‌ను హెచ్చరించినట్లు న్యూఢిల్లీ పేర్కొంది. ఈ బిల్లు ఆమోదాన్ని గమనించామని, దీనివల్ల ద్వైపాక్షిక సంబంధాలపై, అంతర్జాతీయ ఇంధన మార్కెట్‌పై పడే ప్రభావం గురించి గత కొన్ని నెలలుగా అమెరికన్ అధికారులతో జరిగిన చర్చల్లో చాలా స్పష్టంగా వివరించామని భారత విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. భారత వాణిజ్య, ఆర్థిక ప్రయోజనాలను కాపాడుకోవడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని కూడా ఆ ప్రకటనలో ప్రభుత్వం స్పష్టంచేసింది. దేశంలోని వాణిజ్య, పారిశ్రామిక సంస్థలతో కలిసి ఈ చట్టంవల్ల కలిగే పరిణామాలను ఎదుర్కొంటామని ప్రభుత్వం భరోసా ఇచ్చింది. తమ భారీ జనాభా, ఆర్థిక వ్యవస్థ అవసరాల దృష్ట్యా సురక్షితమైన, సరసమైన, నమ్మకమైన ఇంధన సరఫరాలు అత్యవసరమని భారత్ తన వైఖరిని తెలియజేసింది.

## రష్యా నుంచి చమురు కొనొద్దు

వాషింగ్టన్ :రష్యా నుంచి చమురు, సహజవాయువు కొనుగోలు చేస్తున్న భారత్, చైనా వంటి దేశాలకు డొనాల్డ్ ట్రంప్ సర్కారు హెచ్చరికలు చేసింది. రష్యాపై ఆధారపడటం తగ్గించుకోకపోతే అసాధారణమైన ఆర్థిక ఆంక్షలు ఎదుర్కోవాల్సి వస్తుందని పేర్కొంది. రష్యా చమురును ఇతర దేశాలు కొనుగోలు చేయకుండా కొత్త ఆంక్షలతో కూడిన బిల్లును యూఎస్ కాంగ్రెస్ ఆమోదించిన నేపథ్యంలో తాజా పరిణామాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. అమెరికన్ కాంగ్రెస్‌లో రిపబ్లికన్ సెనేటర్ రిచర్డ్ బ్లూమెంటల్ మాట్లాడుతూ.. 'భారత్, చైనాలకు మా సందేశం ఒక్కటే. మీ పద్ధతి మార్చుకోండి. మీకు కావాల్సిన చమురు, గ్యాస్‌ను వేరే దేశాల నుంచి కొనండి. బుజ్జగింపులు సరైన వ్యూహం కాదు' అని ఘాటుగా వ్యాఖ్యానించారు. ఈ కొత్త ఆంక్షల ద్వారా రష్యా అధ్యక్షుడు పుతిన్‌ను చర్చలవైపు నెట్టి, ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలుకవచ్చని ఆయన ఆశాభావం వ్యక్తంచేశారు. "పుతిన్, మా దగ్గర నీ నంబర్ ఉంది. ఉక్రెయిన్.. మీరు ఒంటరి కాదు" అని ఆయన అన్నారు. 'లిండ్సే ఓ గ్రాహం సాంక్షనింగ్ రష్యా అండ్ ఇరాన్ యాక్ట్ ఆఫ్ 2026' పేరుతో రూపొందించిన ఈ చట్టం, రష్యా అధికారులు, బ్యాంకులు, అలాగే రష్యా ఇంధనాన్ని ప్రపంచవ్యాప్తంగా రవాణా చేస్తున్న 'షాడో ఫ్లీట్' (రహస్య ట్యాంకర్ల వ్యవస్థ) పై కఠిన ఆంక్షలు విధిస్తుంది. ఈ చట్టం ప్రకారం.. రష్యా నుంచి అత్యధికంగా చమురు, గ్యాస్ దిగుమతి చేసుకుంటున్న మొదటి ఐదు దేశాలపై 100 శాతం వరకు టారిఫ్‌లు విధించే అధికారాన్ని అమెరికా అధ్యక్షుడికి కట్టబెడుతుంది. ఈ జాబితాలో భారత్, చైనాలు ప్రధానంగా ఉన్నాయి. అయితే రష్యా గ్యాస్ ఎగుమతుల్లో 15 శాతం కంటే తక్కువ దిగుమతి చేసుకుంటూ వాటిని తగ్గించడానికి గణనీయమైన చర్యలు తీసుకున్న దేశాలకు మినహాయింపు ఇచ్చారు. ఈ బిల్లుకు అమెరికా ప్రతినిధుల సభలో 262-159 ఓట్ల తేడాతో ఆమోదం లభించింది. ప్రస్తుతం ఇది అధ్యక్షుడు ట్రంప్ సంతకం కోసం వేచి ఉంది.

## ఇరాన్ పోరులో అమెరికా యుద్ధ నేరాలు

### ఆధారాలున్నాయన్న అంతర్జాతీయ నిజనిర్ధారణ బృందం

న్యూయార్క్ :ఇరాన్‌పై దాడుల సమయంలో అమెరికా యుద్ధ నేరాలకు పాల్పడిందా? దీనిపై ఐరాస మానవ హక్కుల సంస్థ నియమించిన అంతర్జాతీయ నిజనిర్ధారణ బృందం అవుననే అంటోంది. ఇరాన్‌పై జరిపిన రెండు దాడుల్లో అగ్రరాజ్యం యుద్ధ నేరాలకు పాల్పడిందని చెప్పేందుకు తగిన ఆధారాలు లభించాయని తెలిపింది. ఈ రెండు దాడుల్లో మహిళలు, చిన్నారులు సహా దాదాపు 178 మంది మృతి చెందినట్లు వెల్లడించింది. నిజనిర్ధారణ బృందం ప్రస్తావించిన రెండు ఘటనల్లో ఒకటి.. మినాబ్‌లోని పాఠశాలపై తోమహాక్ క్షిపణి దాడి కాగా, మరొకటి లామెర్డ్ నగరంలోని స్పోర్ట్స్ కాంప్లెక్స్, నివాస ప్రాంతంపై జరిగిన వైమానిక దాడి. అదేవిధంగా ఇరాన్‌లో భద్రతా బలగాలు మారణకాండకు పాల్పడ్డాయని నిజనిర్ధారణ బృందం ఆరోపించింది. ఒకవైపు, సొంత ప్రభుత్వమే హక్కుల ఉల్లంఘనలకు పాల్పడటం, మానవత్వానికి వ్యతిరేకంగా నేరాలు చేయడం.. మరోవైపు అమెరికా,



ఇజ్రాయెల్‌లతో యుద్ధం.. ఈ రెండింటి మధ్య అక్కడి పౌరులు చిక్కుకుపోయారని తెలిపింది. పశ్చిమాసియా యుద్ధం ప్రారంభమైన సమయంలో మినాబ్‌లోని ఓ పాఠశాలపై జరిగిన దాడి ప్రపంచాన్నిగ్భ్రాంతికి గురిచేసిన సంగతి తెలిసిందే. ఫిబ్రవరి 28న ఇరాన్‌లోని ఐఆర్‌జీసీ స్థావరాలపై అమెరికా దాడులు చేస్తుండగా మినాబ్‌లోని ఓ పాఠశాలను క్షిపణి తాకింది. ఈ ఘటనలో 168 మంది మృతి చెందారని, వారిలో ఎక్కువ మంది పిల్లలే ఉన్నట్లు ఇరాన్ ప్రభుత్వ మీడియా తెలిపింది. మరోవైపు.. లామెర్డ్‌పై దాడికి తాము బాధ్యులం కాదని యూఎస్ సెంట్రల్ కమాండ్ ఇప్పటికే ఖండించింది.

# పండితాపురంలో ఘనంగా విమోచన దినోత్సవం




**కామేపల్లి,సెప్టెంబర్ 17 (భద్రాద్రి న్యూస్):** 1948 సెప్టెంబర్ 17న నిజాం నిరంకుశ పాలన నుంచి, 2014 జూన్ 2న ఆంధ్ర పాలకుల నుంచి తెలంగాణకు విముక్తి కల్పించిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందని డిసిసిబి డైరెక్టర్, మాజీ జడ్పిటిసి మేకల మల్లిబాబు యాదవ్, కొండాయిగూడెం పిఎసిఎస్ అధ్యక్షుడు ధనియాకుల హనుమంతరావు స్పష్టం చేశారు. మండలంలోని పండితాపురం గ్రామంలో కొండాయిగూడెం ప్రాథమిక సహకార పరపతి సంఘం ఆవరణలో గురువారం తెలంగాణ విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకుని జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మల్లిబాబు యాదవ్ మాట్లాడుతూ.. దేశానికి 1947లోనే స్వాతంత్ర్యం వచ్చినా నిజాం నవాబు రౌడీ మూక రజాకార్లతో తెలంగాణ ప్రజలను తీవ్ర హింసలకు గురిచేశారని ఆవేదన వ్యక్తం చేశారు. బైరాన్‌పల్లిలో వెయ్యి మందిని ఉరితీయడం, మహిళలపై అకృత్యాలకు పాల్పడటం వంటి నిరంకుశ చర్యలకు పాల్పడ్డారన్నారు. వీటికి వ్యతిరేకంగా దొడ్డి కొమరయ్య, చాకలి ఐలమ్మ, షేక్ బందగి వంటి వీరులు సాగించిన పోరాటాలు చరిత్రలో నిలిచిపోతాయన్నారు. నాటి నెహ్రూ ప్రభుత్వంలో ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ సైనిక చర్య (ఆపరేషన్ పోలో) ద్వారా నిజాం కోరలు ఊడదీసి తెలంగాణను భారత యూనియన్‌లో విలీనం చేశారని గుర్తుచేశారు. ?అలాగే, ఆంధ్రలో పార్టీకి రాజకీయ మనుగడ ఉండదని తెలిసినా, తెలంగాణ ప్రజల ఆకాంక్షను గౌరవిస్తూ కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ ప్రత్యేక రాష్ట్ర కల సాకారం చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ కార్యదర్శి ముత్తయ్య, డైరెక్టర్లు కొమ్మినేని శ్రీనివాసరావు, అయితనబోయిన విఠల్‌రావు, ఉప్పుగండ్ల వీరభద్రరావు, శీలం పుల్లయ్య, అయితనబోయిన నాగేశ్వరరావు, అంబడిపూడి వెంకటయ్య, దండగల దేవేంద్ర, సిబ్బంది సలీమ్, రమేష్, రామారావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు

# గోవింద్రాలలో దేవాదాయ భూముల కౌలుకు బహిరంగ వేలం




**కామేపల్లి,సెప్టెంబర్ 17 (భద్రాద్రి న్యూస్):** దేవాదాయ ధర్మాదాయ శాఖ ఖమ్మం జిల్లా వారి ఆధ్వర్యంలో గోవింద్రాల గ్రామంలో ఉన్న ఉన్న శ్రీ అభయ ఆంజనేయ స్వామి వారి దేవాదాయ భూముల కౌలుకు బహిరంగ వేలం పాట గ్రామ పంచాయితీ కార్యాలయంలో గురువారం నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ దేవాదాయ ధర్మాదాయ శాఖ వారు జారీ చేసిన కౌలుకు ఉన్న భూమి బహిరంగ వేలం ప్రకటన--5వ నోటీసు ప్రకారం గోవింద్రాల గ్రామపంచాయతీ కార్యాలయంలో ఈ వేలం ప్రక్రియ ప్రారంభించడం జరిగింది. గోవింద్రాల గ్రామంలోని శ్రీ అభయాంజనేయ స్వామి వారి దేవస్థానానికి సంబంధించిన భూముల్లో సర్వే నంబర్ 138లో 9 ఎకరాల 23 కుంటలు),మరొక సర్వే నంబర్ 173లో ఒక ఎకరం 35 కుంటలు.కలిపి మొత్తం 11 ఎకరాల 18 కుంటల భూమికి బహిరంగ వేలం నిర్వహించారు.వేలం పాటలో పాల్గొనదలచిన పాటా దారులు నిబంధనల ప్రకారం రూ.5,000 నగదు డిపాజిట్ చేసి వేలంలో పాల్గొన్నారు.వేలం ప్రక్రియలో సర్వే నంబర్ 138లోని 9-23 ఎకరాల భూమిని అధిక పాట దారుడైన ఆలోత్ మోహన్, తండ్రి లాలు వేలంలో దక్కించుకున్నారు. అదేవిధంగా మరో పాట దారుడు అజ్మీరా చందు, తండ్రి భావుసింగ్ సర్వే నంబర్ 173లోని 1-35 ఎకరాల భూమిని వేలంలో దక్కించుకున్నారు. ఈ బహిరంగ వేలం కార్యక్రమంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ ఇన్స్పెక్టర్ రెంటాల సమత,ఈవో వేణుగోపాల చార్యులు,పోలీస్ శాఖ ఏఎస్ఐ వెంకటరత్నం. వారితో పాటు సంపత్ అంజి. కలాం.రమేష్. గ్రామ పంచాయతీ సెక్రటరీ ప్రవీణ్, గ్రామ సర్పంచ్ బానోత్ కమలా,ఉప సర్పంచ్ ఆలోత్ తారా శివ, దేవాదాయ శాఖ సిబ్బ గ్రామస్తులు ఆలోత్ లక్కు,మాలోత్ భావుసింగ్,బానోత్ భాణ్య,ఆలోత్ భీముడు,వేలం పాట దారులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.వేలం ప్రక్రియ నిబంధనల ప్రకారం నిర్వహించబడింది. అని వారు అన్నారు ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు

# తెలంగాణ రాష్ట్ర విమోచన దినోత్సవం జాతీయ జెండా ఆవిష్కరణ

-- గ్రామ సర్పంచ్ అరెం అచ్చమ్మ




**కామేపల్లి,సెప్టెంబర్ 17 (భద్రాద్రి న్యూస్):** కామేపల్లి మండలం పరిధిలోని కెప్టన్ బంజారా గ్రామంలో తెలంగాణ రాష్ట్ర విమోచన దినోత్సవం జాతీయ జెండా ఆవిష్కరించిన గ్రామ సర్పంచ్ అరెం అచ్చమ్మ ఈ కార్యక్రమం ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ అరెశీ అచమ్మ మాట్లాడుతూ తెలంగాణ ప్రజల చారిత్రక పోరాటం, త్యాగాలు, ప్రజాస్వామ్య విలువలను స్మరించుకుంటూ ఈ తెలంగాణ ప్రాంతం భారత యూనియన్‌లో విలీనమైన చారిత్రక సందర్భాన్ని గుర్తుచేసుకుంటూ, అమరవీరుల త్యాగాలను స్మరించుకోవడం, వారి ఆశయాలను ముందుకు తీసుకెళ్లడం ప్రతి ఒక్కరి బాధ్యత. అని వారు ఈ సందర్భంగా గ్రామ ప్రజలందరికీ ఐక్యత, సోదరభావం, దేశభక్తి,సామాజిక బాధ్యతల ప్రాధాన్యతను తెలియజేస్తూ, గ్రామ అభివృద్ధి కోసం అందరూ కలిసి పనిచేయాలని పిలుపునివ్వడం జరిగింది. కాంగ్రెస్ రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో ప్రజా పాలనలో ప్రతి పేద బీద కుటుంబాల సామాజిక వర్గ కోసం తమ వంతు కృషి చేస్తానని ప్రజల సంక్షేమం, గ్రామ అభివృద్ధి, సామాజిక సమానత్వం లక్ష్యంగా ముందుకు సాగుతూ, తెలంగాణ రాష్ట్ర ప్రగతిలో ప్రతి ఒక్కరూ తమ వంతు పాత్ర పోషించాలని ఆకాంక్షించడం జరిగింది. వారు అన్నారు ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు మహిళలు పాలకమండలి సభ్యులు ప్రజాప్రతినిధులు కార్యకర్తలు అభిమానులు పెద్ద సంఖ్యలో తదితరులు పాల్గొన్నారు

# అంగన్వాడి సేవలు బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలి

- పోషకాహారంతోనే సమగ్ర ఆరోగ్యం రక్షణ
- కామేపల్లి మండల సీడీపీఓ ఉమ
- స్వయం సహాయక సంఘాల సభ్యులకు అవగాహన




**కామేపల్లి,సెప్టెంబర్ 17(భద్రాద్రి న్యూస్):** మహిళల ఆరోగ్యం పట్ల సమాజంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని, పోషకాహార లోపం లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని కామేపల్లి సీడీపీఓ ఉమ అన్నారు.'పోషణ మాసం'సందర్భంగా గురువారం కామేపల్లి మండల కేంద్రంలో స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ) సభ్యులకు అందరికీ నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆమె మాట్లాడారు. నేటి సమాజంలో మహిళలు స్వయం సహాయక సంఘాల ద్వారా ఆర్థికంగా, సామాజికంగా అగ్రగామిగా నిలుస్తూ మహిళా సాధికారతను నిరూపిస్తున్నారని కొనియాడారు. ఎంత పని ఒత్తిడి ఉన్నప్పటికీ మహిళలు తమ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయవద్దని, నిత్యం పోషకాలతో కూడిన ఆహారం తీసుకోవాలని సూచించారు. ఆరోగ్యవంతమైన మహిళలతోనే సదృఢమైన కుటుంబం,సమగ్ర సమాజ అభివృద్ధికి నిర్మాణం పునాది సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. ముఖ్యంగా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు సమతుల ఆహారాన్ని అందించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం సరఫరా చేస్తున్న బాలమృతం, పౌష్టికాహారాన్ని క్రమం తప్పకుండా వినియోగించుకోవాలని కోరారు.పిల్లల శారీరక,మానసిక ఆరోగ్య వికాసానికి పోషకాహారమే పునాది అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మండల అంగనవాడి సూపర్వైజర్లు విజయలక్ష్మి, వరలక్ష్మి, వెలుగు ఏపీఎం వెంకటరామారావు, అంగన్‌వాడీ కార్యకర్తలు,ఆయా స్వయం సహాయక సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# గుడిబండ గ్రామంలో గణేష్ మండపం దగ్ధం

- దగ్ధం తీరుపై పోలీసుల విచారణ .
- దగ్ధం సంఘటనకు నిరసనగా ఆర్ఎస్ఎస్ , బిజెపి ధర్నా.




**కోదాడ, సెప్టెంబర్ 17, భద్రాద్రి న్యూస్ :** కోదాడ మండల పరిధిలోని పాత గుడిబండ గ్రామంలో కమ్యూనిటీ హాల్ వద్ద ఏర్పాటుచేసిన గణేష్ ఉత్సవ మండపం బుధవారం అర్ధరాత్రి అనుమానస్పదంగా దగ్ధమైంది. గణేష్ మండపంలో ఉన్న ఫర్నిచర్, టెంట్, అలంకరణ సామాగ్రి, కార్పెట్లు, కుర్చీలు, విద్యుత్ వైర్లు,పూర్తిగా దగ్ధమయ్యాయి. ఈనెల 14వ తేదీన గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో కమ్యూనిటీ హాల్ వద్ద గణేష్ మండపాన్ని శోభాయమానంగా అలంకరించి ఏర్పాటు చేసి నవరాత్రి ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. ప్రతిరోజు గణపతికి విశేష రీతిలో ఫల పుష్పాలు ధూపదీప నైవేద్యాలతో కాలనీవాసులు ప్రతిరోజు పూజలు నిర్వహిస్తున్నారు. అయితే అకస్మాత్తుగా బుధవారం అర్ధరాత్రి గణేష్ మండపం అనుమానస్పద పరిస్థితుల్లో దగ్ధం కావడం భక్తులను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది. ఈ ప్రమాదం జరిగిన సమయంలో అక్కడ భక్తులు, యువకులు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. తాము ప్రతిరోజు పూజలు చేస్తున్న గణేష్ మండపంలో దగ్ధం కావడాన్ని భక్తులు తీవ్ర విచారం వ్యక్తం చేస్తున్నారు. గణేష్ మండపం దగ్ధం సమాచారం తెలుసుకున్న కోదాడ రూరల్ పోలీసులు పాత గుడిబండ గ్రామానికి వచ్చి దగ్ధం సంఘటన పట్ల విచారణ నిర్వహించారు. కేసు నమోదు చేసి సంఘటన పూర్వపరాలను విచారణ చేసి బాధ్యులపై తీవ్ర కఠిన చర్యలు తీసుకుంటామని రూరల్ పోలీసులు తెలియజేశారు .కాగా గణేష్ మండపం దగ్ధం సంఘటనను తెలుసుకున్న ఆర్ఎస్ఎస్, బిజెపి కార్యకర్తలు పాత గుడిబండ గ్రామంలోని గణేష్ మండపం వద్దకు చేరుకుని దగ్ధం సంఘటనను పరిశీలించారు. అనంతరం గుడిబండ ప్రధాన రహదారిపై ఆర్ఎస్ఎస్, బిజెపి కార్యకర్తలు నిరసన ధర్నా నిర్వహించారు. గణేష్ మండపం దగ్ధం కావడం షార్ట్ సర్క్యూట్ వలన జరగలేదని ఈ సంఘటనను కావాలనే దుండగులు దగ్ధం చేశారని ఆర్ఎస్ఎస్ నాయకులు ఆరోపిస్తున్నారు. ఈ సంఘటన గురించి జిల్లావ్యాప్తంగా , రాష్ట్రవ్యాప్తంగా ప్రజల దృష్టికి తీసుకొని వెళ్తామని ఆర్ఎస్ఎస్ నాయకులు తెలిపారు. హైందవ ధర్మంలో గణేష్ ఉత్సవాలకు అత్యధిక ప్రాధాన్యత ఉందని అందరూ నిష్టగా పూజించే గణేష్ మండపం దగ్ధం సంఘటనకు పాల్పడిన దుండగులను కఠినంగా శిక్షించాలని ఆర్ఎస్ఎస్, బిజెపి నాయకులు ముక్తకంఠంతో నిరసన వ్యక్తం చేస్తున్నారు.

**---దుండగులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలి... బీజేపీ జిల్లా అధ్యక్షురాలు చల్లా శ్రీలతా రెడ్డి**

గుడిబండ గ్రామంలోని ఎస్సీ కాలనీలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద నిప్పు అంటుకోవడంతో అక్కడున్న పలు వస్తువులు, పరికరాలు కాలిపోయిన ఘటనపై గ్రామస్తులు, మండపం కమిటీ సభ్యులు అనుమానాలు వ్యక్తం చేశారు. ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని వారు కోరారు. ఈ ఘటనకు నిరసనగా గురువారం బీజేపీ సూర్యాపేట జిల్లా అధ్యక్షురాలు చల్లా శ్రీలతా రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, హిందూ సమాజానికి చెందిన పలువురు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చల్లా శ్రీలతా రెడ్డి మాట్లాడుతూ.. వినాయక మండపం వద్ద జరిగిన ఘటనపై పోలీసులు అన్ని కోణాల్లో సమగ్ర దర్యాప్తు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఘటనకు బాధ్యులైన వారెవరైనా గుర్తించి వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఘటనను పూర్తిస్థాయిలో విచారించకుండా కేసును ముగించే ప్రయత్నం చేస్తున్నారనే అనుమానాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయని ఆమె అన్నారు. దీనిపై పోలీసులు స్పష్టమైన దర్యాప్తు చేపట్టి వాస్తవాలను వెల్లడించాలని డిమాండ్ చేశారు. వినాయక మండపం వద్ద జరిగిన ఘటనతో గ్రామస్తులు, కమిటీ సభ్యులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. బాధ్యులను గుర్తించి చర్యలు తీసుకునే వరకు పోరాటం కొనసాగిస్తామని బీజేపీ నాయకులు తెలిపారు. ధర్నాలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు, వినాయక మండపం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.




# మహిళా సంఘాల అభివృద్ధియే ప్రభుత్వ లక్ష్యం

- ఎంపీడీవో సోమ్లాల్,
- ఏ పి యం వెంకట రామారావు



**కామేపల్లి,సెప్టెంబర్ 17 (భద్రాద్రిన్యూస్):** అజంతా మండల మహిళా సమాఖ్య కామేపల్లి.మండల సమాఖ్య అధ్యక్షురాలు ఉషశ్రీ ఆధ్వర్యంలో 20వ వార్షిక మహాసభ సందర్భంగా సర్వసభ్య సమావేశం కామేపల్లి రైతు వేదికలో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి మండల పరిషత్ అభివృద్ధి అధికారి సోమలాల్.ఏపీఎం వెంకటరామారావు ఐసిడిఎస్ సిడిపిఓ ఉమా.పాల్గొని సభ్యుల అందరికీ రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమాలు తెలియజేయడం జరిగింది మహిళా సంఘాల ప్రతినిధులు,గ్రామ సమాఖ్యల సభ్యులు,మహిళా సంఘాల సభ్యులు, గ్రామ సమాఖ్య లీడర్లు సంబంధిత అధికారులు సమావేశంలో గత సంవత్సర కాలంలో మహిళా సమాఖ్య ద్వారా చేపట్టిన కార్యక్రమాలు, సాధించిన ప్రగతి, మహిళా సంఘాల పనితీరు, పొదుపుశ్రీ మరియు రుణాల నిర్వహణ, ఆర్థిక కార్యకలాపాలు, మహిళల జీవనోపాధి అభివృద్ధి తదితర అంశాలపై చర్చించారు. అలాగే మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించడం, బ్యాంకు లింకేజీ సిఐఎఫ్ పీఎం ఎఫ్ఎంఈ రూరల్ అవుట్లెట్లు అదేవిధంగా బ్యాంకుల ద్వారా వ్యాపారాలకు వ్యక్తిగత రుణాలు మంజూరి చిన్న తరహా వ్యాపారాలను ప్రోత్సహించడం, మహిళా సంఘాలను మరింత బలోపేతం చేయడం, కుటుంబ ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచడం వంటి అంశాలపై సభ్యులకు అవగాహన కల్పించారు. మహిళా సంఘాల ద్వారా మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధిస్తూ, కుటుంబంతో పాటు గ్రామ అభివృద్ధిలో కూడా కీలక పాత్ర పోషిస్తున్నారని సమావేశంలో పేర్కొన్నారు. రానున్న కాలంలో మహిళా సంఘాల కార్యకలాపాలను మరింత విస్తరించి, ప్రతి మహిళకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు మరియు అభివృద్ధి కార్యక్రమాల ప్రయోజనాలు అందేలా కృషి చేయాలని నిర్ణయించారు. 20వ వార్షిక మహాసభ సందర్భంగా గత సంవత్సరపు ఆదాయ-వ్యయాలు, సంఘం కార్యకలాపాలు, భవిష్యత్ కార్యాచరణ ప్రణాళిక తదితర అంశాలను సర్వసభ్య సమావేశం ముందు ఉంచి సభ్యుల ఆమోదం పొందారు. మహిళా సమాఖ్య భవిష్యత్ కార్యక్రమాలపై సభ్యుల అభిప్రాయాలు, సూచనలు స్వీకరించి, వాటి ఆధారంగా రాబోయే సంవత్సరానికి తెలంగాణ గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ కార్యక్రమ కార్యాచరణ రూపొందించాలని ప్రభుత్వం అందిస్తున్న అన్ని కార్యక్రమాలను గ్రూపులకు అనుసంధానం చేయాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా మహిళా సంఘాల సభ్యులు ఐక్యతతో పనిచేస్తూ, మహిళల ఆర్థిక మరియు సామాజిక అభివృద్ధికి మరింత కృషి చేయాలని పిలుపునిచ్చారు ఈ సమావేశంలో సీసీలు పుష్ప సరోజినీ నాగమణి సుభద్ర ఉపేంద్ర శోభ మరియు ఆపరేటర్ వంశీ, అకౌంటెంట్ కౌసల్య పాల్గొన్నారు.

# ఉమ్మడి ఖమ్మం జిల్లా అండర్-15 చెస్ ఛాంపియన్‌షిప్ 2026

**విజేతగా నిలిచిన స్టెమ్‌స్పార్క్ రెజొనెన్స్ శ్రీనగర్ విద్యార్థి ఆర్యన్ షణ్ముఖ్**



**ఖమ్మం ప్రతినిధి ,సెప్టెంబర్ 17 (భద్రాద్రి న్యూస్):** ఖమ్మం స్థానిక శ్రీనగర్ కాలనీలో గల స్టెమ్‌స్పార్క్ రెజొనెన్స్ స్కూల్ విద్యార్థి ఓ.ఆర్యన్ షణ్ముఖ్ శ్రీరామ్ ఉమ్మడి ఖమ్మం జిల్లా అండర్-15 చెస్ ఛాంపియన్‌షిప్ 2026 పోటీలలో పాల్గొని ద్వితీయ బహుమతిని కైవసం చేసుకుని విజయ దుంధుబి మోగించారు. స్కూల్‌లో జరిగిన అభినందన సభలో పాఠశాల డైరెక్టర్స్ కె.శ్రీధర్‌రావు మరియు శ్రీమతి కృష్ణవేణి ట్రోఫీ మరియు పతకాలు సాధించిన విద్యార్థి షణ్ముఖ్‌ను అభినందించి ఆశీర్వదించారు, 13 సంవత్సరాల వయస్సులోనే చెస్‌లో ఎంతో నైపుణ్యాన్ని సాధించి తన ప్రతిభతో జిల్లా రాష్ట్ర స్థాయిలలో విజయాలను సాధిస్తున్న స్టెమ్‌స్పార్క్ రెజొనెన్స్ విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలలో విజయాలను సాధించి తల్లిదండ్రులకు దేశానికి గొప్ప పేరు తేవాలంటూ తాము పాఠశాలలో ఆట పాటలతో కూడిన విద్యను అందిస్తూ విద్యార్థుల భవిష్యత్తుకు ఉన్నత ప్రణాళికలను అమలుపరుస్తున్నందున అన్ని రంగాలలో విద్యార్థులు సర్వతోముఖాభివృద్ధి చెంది అద్భుతమైన ఫలితాలు సాధిస్తున్నారని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొని విజేతలను అభినందించారు.

# తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా జాతీయ జెండా ఆవిష్కరణ

**ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 17 (భద్రాద్రి న్యూస్):** తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా ఖమ్మం స్టాంభాద్రి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (సుడా) కార్యాలయంలో జాతీయ జెండాను సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గ ప్రసాద్ ఎగురవేశారు. ఈ సందర్భంగా సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గ ప్రసాద్ , మున్సిపల్ కమిషనర్ , సుడా వైస్ చైర్మన్ అభిషేక్ అగస్త్య తో కలిసిజాతీయ జెండాకు గౌరవ వందనం చేశారు. ఈ సందర్భంగా వారు తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం ప్రాధాన్యతను గుర్తుచేస్తూ, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని అన్నారు. ప్రజా సంక్షేమం, పట్టణ అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా కృషి చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సుడాకు సంబంధించిన అధికారులు, ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బంది, ఇతర ప్రజాప్రతినిధులు , నాయకులు పాల్గొన్నారు.



# త్రివేణి విద్యార్థినిని అభినందించిన అడిషనల్ కలెక్టర్

**- జిల్లాస్థాయి సైన్స్ సెమినార్ లో ప్రథమం - రాష్ట్ర స్థాయి పోటీకి ఎంపికైన వనీషా రెడ్డి**



**ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 17( భద్రాద్రి న్యూస్):** జాతీయ సైన్స్ సెమినార్--2026లో భాగంగా " ఇండియన్ ఎనర్జీ బాస్కెట్ 2047: పర్స్పెక్టెడ్ అండ్ ఛాలెంజ్ అంశంపై నిర్వహించిన జిల్లాస్థాయి సైన్స్ సెమినార్‌లో త్రివేణి పాఠశాల, ఖమ్మం శాఖకు చెందిన కె. వనిషా రెడ్డి ప్రథమ స్థానం సాధించారు. జిల్లా సైన్స్ మ్యూజియం, ఖమ్మంలో నిర్వహించిన ఈ పోటీలో ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి సైన్స్ సెమినార్‌కు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్/జిల్లా విద్యాశాఖ అధికారి సదానందం, ఇంచార్జ్ డి.ఎస్.ఓ. వెంకటేశ్వర్లు.ఇ విద్యార్థినిని మరియు గైడ్ టీచర్స్ బాలాజీ, షరీఫ్ లను అభినందించారు. విద్యార్థిని వనీషా రెడ్డికి పాఠశాల డైరెక్టర్ డా. గొల్లపూడి వీరేంద్ర చౌదరి, ప్రిన్సిపాల్ రాజేంద్ర ప్రసాద్ మరియు సి.ఆర్.ఓ కాట్రగడ్డ మురళికృష్ణ,వైస్ ప్రిన్సిపాల్స్ స్వప్న, ముస్తఫా,ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

# సారధి నగర్‌లో ఘనంగా లక్ష్మీ పూజ, కుంకుమ పూజ

**- సామూహిక కుంకుమ పూజలతో మహిళల్లో ఐకమత్యం పెంపొందుతుంది**

**- మాజీ కార్పొరేటర్ కన్నం వైష్ణవి ప్రసన్న కృష్ణ**

**ఖమ్మం ప్రతినిధి ,సెప్టెంబర్ 17( భద్రాద్రి న్యూస్):** సారధి నగర్: శ్రీ బాల గణేష్ ఉత్సవ కమిటీ, సారధి నగర్ ఆధ్వర్యంలో 21వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని లలితా సహస్రనామ సహిత లక్ష్మీ పూజ, సామూహిక కుంకుమ పూజ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు.



ఈ కార్యక్రమానికి అవసరమైన పూజా సామాగ్రిని మాజీ కార్పొరేటర్ కన్నం వైష్ణవి ప్రసన్న కృష్ణ వితరణ చేసి, స్వయంగా పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విఘ్నేశ్వర స్వామివారి ఆశీస్సులు అందరిపై ఉండాలని ఆకాంక్షించారు. మహిళలందరూ సామూహికంగా నిర్వహించే కుంకుమ పూజ వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాల ద్వారా ఐకమత్యం మరింత పెంపొందుతుందని అన్నారు. మహిళల భక్తిశ్రద్ధలతో నిర్వహించిన పూజల ద్వారా ఈ ప్రాంతం సుభిక్షంగా ఉండాలని, భగవంతుని ఆశీస్సులతో ధర్మ పరిరక్షణ జరిగి ప్రజల మధ్య సోదరభావం మరింత బలపడాలని ఆకాంక్షించారు. ఇంత బ్రహ్మాండంగా ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించిన ఉత్సవ కమిటీ సభ్యులను ఆమె అభినందించారు. ఈ కార్యక్రమంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కమిటీ సభ్యులు చేతి శ్రీనివాస్, దండా శివరాం, మల్యాల హరికృష్ణ, చిట్టం శెట్టి శ్రీనాథ్, సంతోష్, ధను, వంగాల రోహిత్ తదితరులు పాల్గొన్నారు.



# టీఎన్జీవోస్ యూనియన్ కార్యాలయంలో ఘనంగా ప్రజా పాలన దినోత్సవం

**- ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారంతోనే ప్రజా పాలన మరింత విజయవంతం.**

**- విశ్వకర్మ జయంతి సందర్భంగా కార్మిక, ఉద్యోగ సోదరులకు శుభాకాంక్షలు**



**ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 17( భద్రాద్రి న్యూస్ ):** తెలంగాణ ప్రజా పాలన దినోత్సవాన్ని పురస్కరించుకొని ఖమ్మం జిల్లా టీఎన్జీవోస్ యూనియన్ కార్యాలయంలో గురువారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా టీఎన్జీవోస్ యూనియన్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు శ్రీ గుంటుపల్లి శ్రీనివాసరావు జాతీయ జెండాను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 1948 సెప్టెంబర్ 17న అప్పటి హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనమైన చారిత్రక ఘట్టాన్ని స్మరించుకుంటూ తెలంగాణ ప్రజా పాలన దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నామని తెలిపారు. ప్రజాస్వామ్యం, సమానత్వం, సామాజిక న్యాయం, ప్రజా సంక్షేమం వంటి విలువలను కాపాడుతూ ప్రజలకు బాధ్యతాయుతమైన సేవలు అందించడం ప్రభుత్వ ఉద్యోగుల ప్రధాన కర్తవ్యమని అన్నారు. ప్రజలకు ప్రభుత్వం కనిపించే ముఖం ఉద్యోగులేనని, ప్రతి పౌరుడిని గౌరవిస్తూ వారి సమస్యలను నిబంధనల మేరకు పరిష్కరించేందుకు కృషి చేయాలని సూచించారు. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం, హక్కుల పరిరక్షణ, సంక్షేమం ప్రజా పాలనలో కీలక అంశాలని శ్రీ గుంటుపల్లి శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ప్రజాస్వామ్య పద్ధతుల్లో పరిష్కరించేందుకు టీఎన్జీవోస్ యూనియన్ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. ఉద్యోగుల సమస్యలు పరిష్కారమైతే వారు మరింత ఉత్సాహంతో ప్రజలకు మెరుగైన సేవలు అందించగలరని అన్నారు. ఉద్యోగులు ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు.

**విశ్వకర్మ జయంతి సందర్భంగా శుభాకాంక్షలు**

విశ్వకర్మ జయంతి సందర్భంగా దేశ నిర్మాణంలో తమ శ్రమ, నైపుణ్యం, సృజనాత్మకతతో కీలక పాత్ర పోషిస్తున్న కార్మికులు, శిల్పులు, చేతివృత్తిదారులు, సాంకేతిక నిపుణులు మరియు ఉద్యోగ సోదరులందరికీ శ్రీ గుంటుపల్లి శ్రీనివాసరావు శుభాకాంక్షలు తెలిపారు. శ్రమకు గౌరవం, నైపుణ్యానికి గుర్తింపు, కార్మికుల సంక్షేమం సమాజ అభివృద్ధికి ఎంతో అవసరమని అన్నారు. టీఎన్జీవోస్ జిల్లా కార్యదర్శి శ్రీ కొనిదెన శ్రీనివాస్ మాట్లాడుతూ, ప్రజా పాలన దినోత్సవ స్ఫూర్తితో ప్రతి ఉద్యోగి ప్రజాసేవ పట్ల తన బాధ్యతను గుర్తించుకొని సమయపాలన, క్రమశిక్షణ, పారదర్శకతతో విధులు నిర్వహించాలని అన్నారు. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల సాధన, హక్కుల పరిరక్షణ, సమస్యల పరిష్కారం కోసం యూనియన్ నాయకత్వం, ఉద్యోగులు ఐక్యంగా పనిచేయాలని ఆయన అన్నారు. ఉద్యోగుల సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, చట్టబద్ధమైన మరియు ప్రజాస్వామ్య పద్ధతుల్లో పరిష్కారం సాధించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ, తెలంగాణ ప్రజా పాలన దినోత్సవ స్ఫూర్తితో ఉద్యోగుల సంక్షేమం, హక్కుల పరిరక్షణతో పాటు ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు ఐక్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ కె. శ్రీనివాసరావు, టీఎన్జీవోస్ యూనియన్ ఖమ్మం జిల్లా అసోసియేటెడ్ అధ్యక్షులు కొమరగిరి దుర్గాప్రసాద్, టీఎన్జీవోస్ నాయకులు యర్ర రమేష్, శ్రీధర్ సింగ్, తాళ్లూరి శ్రీకాంత్, గుర్రం శ్రీనివాసరావు, కోటపాటి రుక్మారావు, నెల్లూరి విజయ, మున్సిపల్ జేఏసీ చైర్మన్ జి. శ్రీనివాసరావు, కన్వీనర్ బుర్రి వెంకటేశ్వర్లు, మున్సిపల్ ఫోరం ఎ. సుధాకర్, కె. వెంకటలక్ష్మి, స్టాలిన్, ఎన్. రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మంలో ఘనంగా విరాట్ విశ్వకర్మ యజ్ఞ మహోత్సవం

**- భక్తిశ్రద్ధలతో పాల్గొన్న విశ్వబ్రాహ్మణ సంఘాల నాయకులు, బీసీ కుల సంఘాల ప్రతినిధులు**

ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 17 (భద్రాద్రి న్యూస్): జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో శ్రీ విరాట్ విశ్వకర్మ యజ్ఞ మహోత్సవ కార్యక్రమాన్ని గురువారం ఖమ్మం ఐడీఓసీ కలెక్టరేట్‌లోని మొదటి అంతస్తు మీటింగ్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు అద్దంకి నాగేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి పెందోట సోమేశ్వరాచారి, జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మోడెపల్లి కృష్ణమాచారి, విశ్వతపస్వి, అర్ధావధాని బ్రహ్మశ్రీ రామడుగు నరసింహస్వామి, జిల్లా అధ్యక్షుడు విజయగిరి సదానందాచారి తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విశ్వకర్మ భగవానుడిని స్మరించుకుంటూ ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. విశ్వకర్మ సమాజం, బీసీ వర్గాల అభివృద్ధి, ఐక్యతకు సంబంధించిన అంశాలపై నాయకులు మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు ఇనుగుర్తి వెంకటేశ్వర్లు, పద్మాచారి, పమ్మి వెంకటేశ్వర్లు, పాపాచారి, సత్తెనపల్లి ఉమామహేశ్వరరావు, లింగాబోయిన పుల్లారావు, రాంబాబు, వల్లపు సోమరాజు, గంటల సదాశివరావు, వేగ్గలం వెంకటేశ్వర్లు, పదిరవురి శ్రీనివాసచారి, వేగ్గలం పాండురంగారావు తదితరులతో పాటు బీసీ కుల సంఘాల నాయకులు, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ సిబ్బంది పాల్గొన్నారు. ఈ విషయాలను జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి జి. జ్యోతి ఒక ప్రకటనలో తెలిపారు.



# అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో తెలంగాణ

**- రాష్ట్ర డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు**

**- వ్యవసాయానికి ప్రాముఖ్యత.. రైతుల సంక్షేమానికి వెన్నుదన్ను**

**- హరిత ఇంధన రాష్ట్రంగా తెలంగాణ**

**- ఘనంగా ప్రజాపాలన దినోత్సవ వేడుకలు**

**- ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన డిప్యూటీ సిఎం**



**ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ - 17 భద్రాద్రి న్యూస్ :** తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా గురువారం డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మల్లు స్థానిక పోలీస్ పేరేడ్ గ్రౌండ్స్ లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డిప్యూటి సీఎం మాట్లాడుతూ, సెప్టెంబర్ 17న భారతదేశంలో అంతర్భాగంగా మారి ప్రజాస్వామ్య పాలనలోకి అడుగుపెట్టిన తెలంగాణ 1,000 రోజుల ప్రజా పాలనలో సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేసిందన్నారు. ప్రజాస్వామిక స్వేచ్ఛ కోసం ఉద్యమించిన యోధుల వెలకట్టలేని త్యాగాలను స్మరించుకోవడం మనందరి బాధ్యత అని పేర్కొన్నారు. ప్రజా ప్రభుత్వం పూర్తి చేసుకున్న పాలనలో పేదలు, రైతులు, మహిళలు, యువత, విద్యార్థుల సంక్షేమానికి అత్యున్నత ప్రాధాన్యతనిచ్చామని డిప్యూటీ సీఎం తెలిపారు. మహాలక్ష్మి పథకం ద్వారా ఉచిత ఆర్టీసీ ప్రయాణం, రూ. 500 కే గ్యాస్ సిలిండర్లను అందిస్తున్నట్లు తెలిపారు. ఖమ్మం జిల్లాలో మహిళలు ఉచిత ఆర్టీసీ ప్రయాణాల ద్వారా రూ. 343.44 కోట్లు ఆదా చేసుకున్నారని వివరించారు. రైతు భరోసా ద్వారా ఖమ్మం జిల్లాలోని 3,41,913 మంది రైతులకు రూ. 427.96 కోట్లు అందించామని, పంట రుణమాఫీ కింద 1,31,760 మంది రైతులకు రూ. 912.61 కోట్ల రుణభారం నుంచి విముక్తి కల్పించామని తెలిపారు. గృహజ్యోతి కింద 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగించే 2.49 లక్షల కుటుంబాలకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామన్నారు. 2030 నాటికి 20,000 మెగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యమే లక్ష్యంగా తెలంగాణను హరిత ఇంధన రాష్ట్రంగా తీర్చిదిద్దుతున్నామని పేర్కొన్నారు. సీతారామ ఎత్తిపోతల పథకం, పాలేరు లింక్ కాలువ, మున్నేరు-పాలేరు లింక్ కాలువ, జవహర్ లిఫ్ట్ ఇరిగేషన్ పనులను వేగవంతం చేశామని తెలిపారు. ఖమ్మం నగరాన్ని వరదల నుంచి రక్షించేందుకు రూ. 525.36 కోట్లతో వరద రక్షణ గోడ నిర్మిస్తున్నామన్నారు. జిల్లాలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు, ఇంజినీరింగ్, నర్సింగ్ కళాశాలలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. రాజీవ్ ఆరోగ్యశ్రీని బలోపేతం చేస్తూ ఆసుపత్రులలో అత్యాధునిక వైద్య వసతులను కల్పిస్తున్నామని తెలిపారు. జిల్లాలో తొలి దశలో 16,597 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి రూ. 491.8 కోట్ల ఆర్థిక సాయం అందించామన్నారు. అలాగే పేదలకు ప్రతి నెలా ఉచిత సన్నబియ్యం సరఫరా చేస్తున్నట్లు పేర్కొన్నారు. టీ-ఐపాస్, పీఎమ్ఈజీపీ ద్వారా రూ. 577 కోట్లకు పైగా పెట్టుబడులను ఆకర్షించి యువతకు నైపుణ్య శిక్షణ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని తెలిపారు. సంక్షేమం, అభివృద్ధిని సమన్వయం చేస్తూ ప్రతి కుటుంబ సంక్షేమం, ప్రతి ప్రాంత సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. వేడుకల్లో భాగంగా పీఎంశ్రీ జెడ్పీహెచ్ ఎస్, పందిళ్లపల్లి విద్యార్థినులు ప్రదర్శించిన ప్రజాపాలన పాట, ఎంజేపీటీబిసి, డబ్ల్యూఆర్జేసి, లంకపల్లి, దానవాయిగూడెం విద్యార్థినులు ప్రదర్శించిన తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ పాట, టీజీఎస్డబ్ల్యూఆర్ఎస్, జేసి టేకులపల్లి విద్యార్థులు ప్రదర్శించిన పొడుస్తున్న పొద్దు మీద నడుస్తున్న గానమా పాటపై నృత్యాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. తెలంగాణ అమరవీరులు జర్పుల సురేష్, మీనా వేణు, వెంపడి రామకృష్ణ, ఎస్కె. మహమూద్ పాషా, యన్మందుల వేణుగోపాల్ ల కుటుంబ సభ్యులను ఘనంగా సత్కరించారు.అనంతరం వ్యవసాయ, ఉద్యానవన, డిఆర్డిఎ, సంక్షేమం, వైద్య ఆరోగ్య, అటవీ, విద్యా, ఎస్సీ/ఎస్టీ/బిసి/మైనారిటీ సంక్షేమం, విద్యుత్, సైబర్ నేరాలు, టిజి ఆర్టీసీ, పౌరసరఫరాలు, మోడల్ స్కూల్స్ శాఖలచే ఏర్పాటుచేసిన స్టాళ్లను డిప్యూటీ సిఎం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, పోలీస్ కమీషనర్ సునీల్ దత్, సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, అదనపు కలెక్టర్లు డా. పి. శ్రీజ, పి. శ్రీనివాస రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి రాంమూర్తి, వివిధ శాఖల జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణకు విమోచన కాంగ్రెస్ పార్టీ వల్లనే సాధ్యపడింది

**- మేకల మల్లిబాబు యాదవ్, ధనియా కుల హనుమంతరావు**

**ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 17 (భద్రాద్రి న్యూస్):** ఆనాడు నిజాం నిరంకుశ పాలన నుండి 1948 సెప్టెంబర్ 17న మరియు ఆంధ్ర పాలకుల నుండి 2014 జూన్ 2న తెలంగాణకు విముక్తి కలిగించిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందని, ఈ విషయం ఎవరూ కాదనలేని నగ్నసత్యమని, డిసిసిబి డైరెక్టర్ మాజీ జడ్పిటిసి మేకల మల్లిబాబు యాదవ్, కొండాయిగూడెం పిఏసిఎస్ అధ్యక్షులు ధనియాకుల హనుమంతరావు అన్నారు. కామేపల్లి మండలం పండితాపురం గ్రామంలో కొండాయిగూడెం ప్రాథమిక సహకార పరపతి సంఘం ఆవరణం లోతెలంగాణ విమోచన దినోత్సవం పిఏసిఎస్ అధ్యక్షులు ధనియాకుల హనుమంతరావు ఆధ్వర్యంలో ఎ జాతీయ జెండాను ఎగురవేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మల్లి బాబు యాదవ్ మాట్లాడుతూ 1947 ఆగస్టు 15న భారతదేశానికి స్వాతంత్రం వచ్చినప్పటికీ నిజాం సంస్థానం మాత్రం నిరంకుశంతో భారత ప్రభుత్వంలో కలవకుండా, నిరంకుశత్వంతో తన రౌడీ మూక రజాకారులతో తెలంగాణ ప్రజలపై అనేక హింసలకు పాల్పడటం జరిగిందని, ఎదురు తిరిగినందుకు నిర్దాక్షిణ్యంగా బైరాన్ పల్లి లో 1000 మందిని ఒకేసారి ఉరి తీయడం జరిగిందని, మహిళలను నగ్నంగా గ్రామాల్లో పరిగెత్తించారని, చెట్లకు వేలాడదీసి కింద మంటలు పెట్టే వారిని, వెట్టి చాకిరి ద్వారా పన్నులు వసూలు చేసి నిజాం నవాబు భోగభాగ్యాలు అనుభవించే వారని, ఇలాంటి కృత్యాలను చూసి సాయుధ తెలంగాణ కమ్యూనిజం, ఆర్య సమాజ్ లాంటి సంస్థలు పెద్ద ఎత్తున తిరుగుబాటు చేయడం జరిగిందని, ఆ పోరాటంలో భాగంగా దొడ్డి కొమరయ్య,చాకలి ఐలమ్మ, షేక్ బందగి మరియు కవులు కళాకారులు ను కాల్చి వేయడం జరిగిందని తెలిపారు. ఇంతటి అకృత్యాలు చూసి నాటి నెహ్రూ ప్రభుత్వంలోని ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ సైనిక చర్య చేపట్టి నిజాం కోరలను ఊడదీసి భారత ప్రభుత్వంలో తెలంగాణను విలీనం జరిగిందని, అదేవిధంగా ప్రత్యేక తెలంగాణ కోసం ఎంతోమంది విద్యార్థులు నేలకొరిగారని, కాంగ్రెస్ పార్టీకి ఆంధ్రాలో రాజకీయమనుగడ ఉండదని తెలిసికూడా, తెలంగాణ ప్రజల ఆకాంక్షల మేరకు కాంగ్రెస్ పార్టీ అధినేత సోనియాగాంధీ చేసిన త్యాగంతో, ఆంధ్ర పాలకుల నుండి తెలంగాణకు స్వేచ్ఛా వాయువులు లభించాయని, ఈ విషయాన్ని ప్రతి ఒక్క తెలంగాణ బిడ్డ ఆలోచించుకోవాల్సిన అవసరం ఉందని, మల్లి బాబు యాదవ్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పిఏసిఎస్ కార్యదర్శి ముత్తయ్య, సొసైటీ డైరెక్టర్లు, కొమ్మినేని శ్రీనివాసరావు, అయితనమైన విఠల్ రావు, ఉప్పుగండ్ల వీరభద్రరావు, శీలం పుల్లయ్య, అయితన బోయిన నాగేశ్వరరావు, అంబడిపూడి వెంకటయ్య, దండగల దేవేంద్ర, సిబ్బంది షేక్ సలీం, బోడ రమేష్, ధనియాకుల రామారావు మరియు ప్రైమరీ స్కూల్ ఉపాధ్యాయులు విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



భద్రాద్రి న్యూస్
తెలుగు దినపత్రిక
Bhadradrinews Telugu Daily


# ఖమ్మంలో ఘనంగా తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం

**- ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అధికారులు అంకితభావంతో పనిచేయాలి : అసిస్టెంట్ కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ**

**ఖమ్మం ప్రతినిధి , సెప్టెంబర్ 17 (భద్రాద్రి న్యూస్):** తెలంగాణ ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని ఖమ్మం కలెక్టరేట్‌లో గురువారం జాతీయ జెండాను అసిస్టెంట్ కలెక్టర్ (లోకల్ బాడీస్) డాక్టర్ పి. శ్రీజ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజా సేవలో అధికారులు మరింత అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రజల కోసం, ప్రజల చేత, ప్రజల కొరకు ఏర్పడిన ప్రజాస్వామ్య వ్యవస్థలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. 1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్ రాజ్యం భారతదేశంలో అంతర్భాగమై ప్రజాస్వామ్య పాలనకు మార్గం సుగమమైందని ఆమె పేర్కొన్నారు. ఈ చారిత్రక సందర్భాన్ని పురస్కరించుకుని తెలంగాణ ప్రభుత్వం సెప్టెంబర్ 17ను ప్రజాపాలన దినోత్సవంగా అధికారికంగా నిర్వహిస్తోందని తెలిపారు.అనంతరం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఎఫ్ఎల్ఎన్ (ఖీశీబఅఝఅశీఖ్రీ ాఖవతీఝఎ ఖఅ చీఐఎవతీఝఎ) స్టాండ్ వద్ద అసిస్టెంట్ కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, జాయింట్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి సదానందం, జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి పెసర ప్రభాకర్ రెడ్డి, జిల్లా అధికారులు, ఎఫ్ఎల్ఎన్ బృందం సభ్యులు ఫొటోలు దిగారు.రాష్ట్రస్థాయిలో ఖమ్మం జిల్లా ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమంలో రెండో స్థానంలో నిలవడంపై జిల్లా విద్యాశాఖ అధికారులను అభినందించారు. అయితే సాధించాల్సిన లక్ష్యం ఇంకా ఎంతో ఉందని, విద్యార్థుల్లో ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యా నైపుణ్యాలను మరింత బలోపేతం చేసేందుకు కృషి చేయాలని సూచించారు.

**పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఘనంగా వేడుకలు**

ఖమ్మం స్థానిక పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన ప్రజాపాలన దినోత్సవ వేడుకల్లో తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ముఖ్యఅతిథిగా పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తెలంగాణ కోసం పోరాడిన అమరవీరుల కుటుంబ సభ్యులను సన్మానించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించిన ఉప ముఖ్యమంత్రి వారిని అభినందించారు. అనంతరం వివిధ ప్రభుత్వ శాఖలు ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించారు. విద్యాశాఖ స్టాల్‌లో ప్రీ-ప్రైమరీ విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., జిల్లా విద్యాశాఖ అధికారి సదానందం, జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి పెసర ప్రభాకర్ రెడ్డితో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.







# ప్రజా పాలన దినోత్సవం.. ఘనంగా జెండా ఆవిష్కరణ

**- ప్రభుత్వ వైద్య సేవలు, సంక్షేమ పథకాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలి: వైద్యాధికారి ఆశిష్**

**వెంకటాపురం, సెప్టెంబర్ 17 (భద్రాద్రి న్యూస్) :** ప్రజా పాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని వెంకటాపురం మండలం ఎదిర ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పీహెచ్‌సీ ఆవరణలో వైద్యాధికారి ఆశిష్ జెండాను ఆవిష్కరించి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా వైద్యాధికారి ఆశిష్ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ ఆరోగ్య పథకాలు, సంక్షేమ కార్యక్రమాలపై గ్రామీణ ప్రాంత ప్రజలకు అవగాహన కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులో ఉన్న వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకునేలా క్షేత్రస్థాయిలో విస్తృత ప్రచారం నిర్వహించాలని వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలకు సూచించారు.ప్రజల ఆరోగ్య పరిరక్షణలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తల పాత్ర ఎంతో కీలకమని ఆయన పేర్కొన్నారు. గ్రామాల్లో ఆరోగ్య సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి, ప్రజలకు అవసరమైన సూచనలు అందిస్తూ వ్యాధుల నివారణపై అవగాహన పెంచాలని తెలిపారు. ముఖ్యంగా ప్రజలు అనారోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా సమీపంలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలను ఆశ్రయించేలా చైతన్యం కల్పించాలని సూచించారు.ప్రజా పాలన లక్ష్యం ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత చేరువ చేయడమేనని, అందులో భాగంగా ఆరోగ్య శాఖ ద్వారా అందుతున్న సేవలు ప్రతి కుటుంబానికి చేరేలా సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని వైద్యాధికారి ఆశిష్ అన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ (HEO) కోటిరెడ్డి, ల్యాబ్ టెక్నీషియన్, హెల్త్ అసిస్టెంట్లు మోహన్, కృష్ణ, భూపతిరావు, రాంబాబు, ఏఎన్ఎం వెంకటరమణ, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# భూభారతి రీ-సర్వేను వేగవంతం చేయాలి

**- ఎమ్మార్వో మద్దినేని మురళి**

**భద్రాద్రి న్యూస్ । దమ్మపేట । సెప్టెంబర్ 17**
దమ్మపేట మండల పరిధిలోని రాచూరుపల్లి పంచాయతీ లో భూభారతి సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. భూభారతి రీ-సర్వే ద్వారా భూముల హద్దులు, విస్తీర్ణం తదితర వివరాలను పక్కాగా నమోదు చేయనున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా దమ్మపేట ఎమ్మార్వో మద్దినేని మురళి మాట్లాడుతూ రీ-సర్వే ప్రక్రియ త్వరలో ప్రారంభమవుతుందని తెలిపారు.భూభారతి రీ-సర్వేకు సంబంధించి అవసరమైన ఏర్పాట్లు చేపడుతున్నట్లు చెప్పారు. సర్వే ప్రక్రియలో భూముల వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించనున్నట్లు తెలిపారు. భూ యజమానులు అధికారులకు సహకరించాలని ఎమ్మార్వో కోరారు. ప్రతి భూమికి సంబంధించిన వివరాలను నిబంధనల ప్రకారం నమోదు చేస్తామని వెల్లడించారు. రీ-సర్వే పూర్తయిన అనంతరం భూ రికార్డులు మరింత స్పష్టతకు వచ్చే అవకాశం ఉందన్నారు. భూ సమస్యలు ఉన్న వారు సంబంధిత పత్రాలతో అధికారులను సంప్రదించాలని సూచించారు. రీ-సర్వే సందర్భంగా హద్దుల విషయంలో రైతుల మధ్య వివాదాలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. అధికారుల సూచనల మేరకు సర్వే కార్యక్రమాన్ని నిర్వహిస్తామని పేర్కొన్నారు. భూముల రీ-సర్వేకు సంబంధించిన సమాచారాన్ని ప్రజలకు తెలియజేస్తామని అన్నారు. రైతులు ఎలాంటి అపోహలకు గురికాకుండా అధికారిక సమాచారం ఆధారంగా ముందుకు సాగాలని సూచించారు. రీ-సర్వే ప్రక్రియ పూర్తయితే భూముల వివరాలపై స్పష్టత ఏర్పడుతుందని తెలిపారు. భూ యజమానులు అధికారులకు సహకరించాలని ఎమ్మార్వో కోరారు. ప్రతి భూమికి సంబంధించిన వివరాలను నిబంధనల ప్రకారం నమోదు చేస్తామని వెల్లడించారు. రీ-సర్వే పూర్తయిన అనంతరం భూ రికార్డులు మరింత స్పష్టతకు వచ్చే అవకాశం ఉందన్నారు.
భూ సమస్యలు ఉన్న వారు సంబంధిత పత్రాలతో అధికారులను సంప్రదించాలని సూచించారు. రీ-సర్వే సందర్భంగా హద్దుల విషయంలో రైతుల మధ్య వివాదాలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. అధికారుల సూచనల మేరకు సర్వే కార్యక్రమాన్ని నిర్వహిస్తామని పేర్కొన్నారు. భూముల రీ-సర్వేకు సంబంధించిన సమాచారాన్ని ప్రజలకు తెలియజేస్తామని అన్నారు.
రైతులు ఎలాంటి అపోహలకు గురికాకుండా అధికారిక సమాచారం ఆధారంగా ముందుకు సాగాలని సూచించారు. రీ-సర్వే ప్రక్రియ పూర్తయితే భూముల వివరాలపై స్పష్టత ఏర్పడుతుందని తెలిపారు.




రైతుల భూ సమస్యల పరిష్కారానికి రీ-సర్వే దోహదపడుతుందని సమావేశంలో అభిప్రాయం వ్యక్తమైంది. త్వరలో రీ-సర్వే ప్రారంభం కానుండటంతో సంబంధిత భూ యజమానులు సహకరించాలని అధికారులు కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొనుసోతు ధనలక్ష్మి, సెక్రెటరీ రవి, రెవిన్యూ సిబ్బంది జిపిఓ గ్రామస్తులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ బడులే భవిష్యత్తుకు బంగారు బాట

**- విద్యార్థులకు ఉచిత యూనిఫాం, షూస్ పంపిణీ.. త్వరలో అల్పాహార సదుపాయం: సర్పంచ్ భూక్య రంజిత్ కుమార్**

**కారేపల్లి , సెప్టెంబర్ 17 (భద్రాద్రి న్యూస్ రాములు ):** ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం విద్యార్థులకు అనేక సదుపాయాలు కల్పిస్తోందని గాదెపాడు సర్పంచ్, సింగరేణి మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు భూక్య రంజిత్ కుమార్ అన్నారు. ప్రభుత్వ బడుల్లో చదివే విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న ఉచిత సదుపాయాలను తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గాదెపాడు గ్రామపంచాయతీ పరిధిలోని ఎంపీయూపీఎస్ పాఠశాలలో గురువారం విద్యార్థినీ, విద్యార్థులకు ఉచితంగా స్కూల్ యూనిఫాం, షూస్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ రంజిత్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే ప్రతి విద్యార్థికి ప్రభుత్వ ఖర్చుతో యూనిఫాం, షూస్ అందించడం ద్వారా తల్లిదండ్రులపై ఆర్థిక భారం తగ్గుతుందని అన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు పాఠశాలల్లో అవసరమైన సదుపాయాలను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలిపారు. ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల సంఖ్యను పెంచడంతో పాటు విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరచాల్సిన అవసరం ఉందన్నారు.

**త్వరలో అల్పాహారం ఏర్పాటు**

విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని త్వరలో ప్రభుత్వ పాఠశాలల్లో అల్పాహారం అందించే కార్యక్రమాన్ని కూడా ఏర్పాటు చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించిందని రంజిత్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమం అమలులోకి వస్తే విద్యార్థులకు మరింత ప్రయోజనం చేకూరుతుందని అన్నారు. అయితే అల్పాహార కార్యక్రమం పూర్తిస్థాయిలో అమలు కావడానికి ముందు తల్లిదండ్రులు, విద్యార్థులు అధికారికంగా అందించే మార్గదర్శకాలను పాటించాలని సూచించారు.



**ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం పెంచాలి**

ప్రైవేట్ పాఠశాలల్లో అధిక ఫీజులు చెల్లించి తల్లిదండ్రులు ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా ప్రభుత్వ పాఠశాలల్లో తమ పిల్లలను చేర్పించాలని రంజిత్ కుమార్ కోరారు. ఉచిత విద్యతో పాటు ప్రభుత్వం అందిస్తున్న యూనిఫాం, షూస్ తదితర సదుపాయాలను సద్వినియోగం చేసుకుని పిల్లల భవిష్యత్తుకు బలమైన పునాది వేయాలని సూచించారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యా కార్యక్రమాలను తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవడం సంతోషకరమని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ అన్నబోయిన ఉపేందర్, ఏఎంసీ చైర్మన్ మధ్యపోయిన జ్యోతి రమేష్, ప్రధానోపాధ్యాయులు మల్లేశ్వరరావు, పాఠశాల ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్ రాణి, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



# పిల్లలకు క్యాన్సర్ చికిత్స విధానంలో తల్లిదండ్రులు అవగాహన కలిగి ఉండాలి

**ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 17 (భద్రాద్రి న్యూస్):** యశోద మెడికల్ సెంటర్ నందు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గత 20 సంవత్సరాలుగా చిన్న పిల్లలకు క్యాన్సర్ చికిత్స అందించడంలో అనుభవం కలిగిన యశోద హాస్పిటల్స్ సోమాజిగూడ డాక్టర్ పరిణిత రెడ్డి గుత్తా ( పీడియాట్రిక్ ఆంకాలజీ ఉ హెమటాలజీ , క్లినిఖ్రీ డైరెక్టర్ అండ్ హెచ్ ఓ డి )మాట్లాడుతూ పిల్లలకు వచ్చే క్యాన్సర్ మరియు క్యాన్సర్ చికిత్స పై తల్లిదండ్రులు అవగాహన కలిగి ఉండాలని అన్నారు . చిన్నపిల్లలకు క్యాన్సిల్ అనేది అరుదైన విషయం కాకపోతే దీని గురించి అవగాహన చాలా ముఖ్యం . పూర్తిగా నయం అయ్యే అవకాశాలు చాలా మెరుగుగా ఉంటాయి (దాదాపు 80%) . పుట్టిన నాటి నుండి 18 సంవత్సరాలు వరకు వచ్చే అవకాశాలు ఉంటాయి . చిన్నపిల్లలకు వచ్చే క్యాన్సర్ యొక్క చికిత్స విధానాలు , పెద్దవారికి వచ్చే క్యాన్సర్ లకు చాలా తేడా ఉంటుందని అన్నారు . పిల్లల క్యాన్సర్ చికిత్సలన్నింటిలోనూ శస్త్రచికిత్స , కీమోథెరపీ రేడియేషన్ , టార్గెటెడ్ థెరపీ , ఇమ్యునోథెరపీ మరియు స్టెమ్ సెల్ ట్రాన్స్ ప్లాంట్ ( ఎముక మజ్జ మార్పిడి ) ఉపయోగిస్తారు . మెరుగైన రిజల్ట్ రావడం కోసం చిన్నపిల్లలకి నిర్దేశించబడిన చిన్నపిల్లల డాక్టర్ క్యాన్సర్ స్పెషలిస్ట్ పర్యవేక్షణలో చికిత్స జరగాలని తెలిపారు . పిల్లల్లో నిరంతరం తగ్గని జ్వరం , రక్తస్రావం , కీళ్ల నొప్పులు , రక్తలేమి , కంతలు , తగ్గని వాంతులు , కొత్తగా మెల్లకన్ను రావడం , రాత్రి వేళలో తగ్గని తలనొప్పి వంటివి లక్షణాలు ఉంటే వెంటనే తల్లిదండ్రులు సంబంధించిన డాక్టర్ ను సంప్రదించవలసిందిగా పేర్కొన్నారు . సెప్టెంబర్ నెల చిల్డ్రన్స్ ఎవర్నెస్ మంత్ కాబట్టి దీంట్లో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించమని అన్నారు . ఈ కార్యక్రమంలో యశోద హాస్పిటల్స్ సోమాజిగూడ డిప్యూటీ జనరల్ మేనేజర్ అనీష్ కుమార్ తివారి , మేనేజర్లు బాల కృష్ణ , సాయి రామ్ పాల్గొన్నారు .




# వీకే ఆవాస్ అపార్ట్‌మెంట్‌లో ఘనంగా వినాయక నవరాత్రి పూజలు

***- మమతా రోడ్డులో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు***





**ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 17 (భద్రాద్రి న్యూస్):** మమతా రోడ్డులోని వీకే ఆవాస్ అపార్ట్‌మెంట్లో వినాయక నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.ఈ సందర్భంగా అపార్ట్‌మెంట్ వాసులు గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తిశ్రద్ధలతో స్వామివారిని కొలిచారు. కుటుంబ సభ్యులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజా కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. కార్యక్రమంలో వి. సతీష్, తిరుమలరావు, ఎస్. వీరబాబు, శివ, మల్లికార్జునరావు, ఝాన్సీ, సువర్ణ, మల్లిక, రమాదేవి, సుజాత, నాగమణి, సునీత, సింధు, దీప్తి, స్వాతి, వాణి తదితరులు పాల్గొన్నారు.

# 19వ డివిజన్‌లో ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు

***- తెలంగాణ సాయుధ పోరాట వీరనారి ఐలమ్మకు ఘన నివాళి***



**ఖమ్మం ప్రతినిధి, సెప్టెంబర్ 17 (భద్రాద్రి న్యూస్):** తెలంగాణ సాయుధ పోరాటంలో ధైర్యసాహసాలతో నిలిచి, పేదలు, రైతులు, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ జయంతిని పురస్కరించుకుని ఖమ్మం నగరంలోని 19వ డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మాజీ కార్పొరేటర్ చామకూరి వెంకటనారాయణ జెండాను ఆవిష్కరించి, ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం ఆమె పోరాట స్ఫూర్తిని స్మరించుకున్నారు. భూస్వామ్య దోపిడీ, అన్యాయానికి వ్యతిరేకంగా ఐలమ్మ చేసిన పోరాటం తెలంగాణ ప్రజల చరిత్రలో చిరస్మరణీయమని నాయకులు పేర్కొన్నారు. పేదలు, రైతులు, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం ఆమె చూపిన ధైర్యం, స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమని అన్నారు. ఈ కార్యక్రమంలో పాషా, నర్సిరెడ్డి, భాస్కర్, బాల, శివరాం, శ్యామల, రాజు, వరికోటి భాస్కర్, మల వెంకట్,తదితరులు పాల్గొన్నారు.

# ఎర్రగుంట ఉన్నత పాఠశాలలో చెత్త నిర్వహణపై అవగాహన



**భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 17 (భద్రాద్రి న్యూస్) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, అన్నపురెడ్డిపల్లి మండలం స్థానిక ఎర్రగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో 'వివిధ రకాల చెత్తల సేకరణ-నిర్వహణ' అనే అంశంపై విద్యార్థులకు, ఉపాధ్యాయులకు గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల విద్యాశాఖాధికారి ఉండేటి ఆనంద కుమార్, గ్రామ సర్పంచ్ సున్నం నాగభూషణం, ఉపసర్పంచ్ వేముల నరేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి సురోజు నరేష్ మాట్లాడుతూ... గ్రామంలోని చెత్తను నాలుగు రకాలుగా వర్గీకరించి సేకరించాలని వివరించారు. అవి:తడి చెత్త, పొడి చెత్త, శానిటేషన్ చెత్త, ప్రత్యేక హానికరమైన చెత్త. ఈ నాలుగు రకాల చెత్తను వేర్వేరుగా సేకరించడం ద్వారానే గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచగలమని ఆయన అవగాహన కల్పించారు. అనంతరం మండల విద్యాశాఖాధికారి ఉండేటి ఆనంద కుమార్ మాట్లాడుతూ... మహాత్మా గాంధీ గారు చెప్పినట్లు 'గ్రామాలే దేశానికి పట్టుగొమ్మలు' అని గుర్తుచేశారు. ప్రతి ఒక్కరూ గ్రామాలలో స్వచ్ఛతను, పరిశుభ్రతను నిరంతరం పాటించాలని పిలుపునిచ్చారు. గ్రామ సర్పంచ్ సున్నం నాగభూషణం మాట్లాడుతూ... విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని, చెత్తను ఎక్కడ పడితే అక్కడ పారవేయకుండా కేవలం నిర్దేశించిన చెత్త కుండీలలో మాత్రమే వేయాలని సూచించారు. పాఠశాల స్థాయి నుంచే పరిశుభ్రత అలవాటు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు శంకర్ మహదేవన్, ఉపాధ్యాయులు, పాఠశాల కార్యాలయ సిబ్బంది, గ్రామ పంచాయతీ సిబ్బంది మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

# ధరల పెరుగుదలకు అడ్డుకట్ట వేయాలి

**- పేదలకు 200 రోజుల ఉపాధి కల్పించాలి: వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కొండబోయిన నాగేశ్వరరావు**



**కారేపల్లి, సెప్టెంబర్ 17 (భద్రాద్రి న్యూస్ రాములు ):** రోజురోజుకూ పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలను నియంత్రించి సామాన్య ప్రజలపై పడుతున్న భారాన్ని తగ్గించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కొండబోయిన నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పేదలకు ఉపాధి హామీ పథకం ద్వారా ప్రతి కుటుంబానికి 200 రోజుల పని కల్పించడంతో పాటు రోజువారీ కూలీ రూ.600 చెల్లించాలని కోరారు. గురువారం కారేపల్లి మండలం బొక్కలతండ గ్రామంలో నిర్వహించిన వ్యవసాయ కార్మికుల జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. పెరుగుతున్న నిత్యావసర ధరలతో పేద, మధ్యతరగతి కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. ప్రజలపై ధరల భారాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. చౌకధరల దుకాణాల ద్వారా బియ్యంతో పాటు వంటనూనె, పప్పులు, పంచదార, చింతపండు, గోధుమలు తదితర 14 రకాల నిత్యావసర సరుకులను పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం వర్షాభావ పరిస్థితుల కారణంగా వ్యవసాయ పనులు తగ్గిపోయి గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ కూలీలకు పనులు దొరకడం లేదని నాగేశ్వరరావు అన్నారు. ఉపాధి హామీ పథకాన్ని పటిష్టంగా అమలు చేసి ప్రతి కుటుంబానికి 200 రోజుల పని కల్పించాలని, పనుల కొలతలతో సంబంధం లేకుండా రోజువారీ కూలీ రూ.600 చెల్లించాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలను పెంచి పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆయన కోరారు. మహిళలకు నెలకు రూ.2,500, భూమిలేని పేదలకు సంవత్సరానికి రూ.12,000 ఆర్థిక సహాయం, ఆసరా పెన్షన్ల పెంపు, కొత్త పెన్షన్ల విడుదల వంటి హామీలను అమలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని అన్నారు. ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లో సంక్షేమ పథకాల అమలుకు అవసరమైన నిధులు విడుదల చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు షేక్ సైదులు మేస్త్రి, బానోత్ శ్రీను, మాలోత్ బాలు, అజ్మీర వినోద్ కుమార్, బావుసింగ్, రాములు, వీరన్న, సక్కుబాయి, సరోజిని, దేవి, శారద, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా తెలంగాణ విమోచన దినోత్సవం

**- గాదెపాడు పంచాయతీ కార్యాలయంలో జాతీయ జెండా ఆవిష్కరణ**




**కారేపల్లి , సెప్టెంబర్ 17 (భద్రాద్రి న్యూస్ రాములు ):** తెలంగాణ విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకుని గాదెపాడు గ్రామపంచాయతీ కార్యాలయంలో గురువారం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గాదెపాడు సర్పంచ్, సింగరేణి మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు భూక్య రంజిత్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ భూక్య రంజిత్ కుమార్ మాట్లాడుతూ 1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనమైన చారిత్రక సందర్భాన్ని గుర్తుచేసుకుంటూ తెలంగాణ విమోచన దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో విలీనం కావడానికి అనేక మంది పోరాటాలు, త్యాగాలు చేశారని, వారి త్యాగాలను ఈ సందర్భంగా స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.దేశ సమైక్యత, ప్రజాస్వామ్య విలువలు, స్వేచ్ఛ కోసం జరిగిన పోరాటాల స్ఫూర్తిని నేటి తరానికి తెలియజేయాలని అన్నారు. ప్రజలు ఐక్యతతో ముందుకు సాగుతూ దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

**చర్లపల్లి రైతు వేదికలో జాతీయ జెండా ఆవిష్కరణ**

చర్లపల్లి రైతు వేదిక వద్ద కూడా తెలంగాణ విమోచన దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. వ్యవసాయ విస్తరణాధికారి బానోత్ మహేష్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం తెలంగాణ విమోచన దినోత్సవ ప్రాధాన్యతను వివరించారు. ఈ కార్యక్రమాల్లో గాదెపాడు ఉపసర్పంచ్ నన్నెబోయిన ఉపేందర్, వార్డు సభ్యులు కల్తీ నాగేశ్వరరావు, భూక్య వీరమ్మ, ఏఈఓ బానోత్ మహేష్, ఏఎన్ఎం కల్పన, అంగన్‌వాడీ టీచర్లు, గ్రామపంచాయతీ సిబ్బంది, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# పాత కొత్తగూడెంలో విషాదం.. ముర్రేడు వాగులో ఆటో డ్రైవర్ మృతదేహం



**కొత్తగూడెం అర్బన్, సెప్టెంబర్ 17 (భద్రాద్రి న్యూస్) :** ఈ నెల 13వ తేదీ నుంచి కనిపించకుండా పోయిన ఆటో డ్రైవర్ ముర్రేడు వాగులో మృతదేహంగా కనిపించడంతో పాత కొత్తగూడెంలో విషాదం నెలకొంది. పాత కొత్తగూడెంకు చెందిన మహమ్మద్ దస్తగిరి (45) ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ నెల 13వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆయన తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. బంధువులు, పరిచయస్తుల వద్ద వెతికినా ఆయన ఆచూకీ లభించలేదు. ఈ క్రమంలో చాతకొండ ప్రాంతంలోని ముర్రేడు వాగులో గుర్తుతెలియని మృతదేహం ఉన్నట్లు సమాచారం అందడంతో పోలీసులు, స్థానికులు అక్కడికి చేరుకున్నారు. మృతదేహాన్ని పరిశీలించగా అది కనిపించకుండా పోయిన మహమ్మద్ దస్తగిరిదేనని కుటుంబ సభ్యులు గుర్తించినట్లు తెలిసింది. దస్తగిరి కుటుంబం కొంతకాలంగా తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నట్లు స్థానికులు తెలిపారు. ఆయన భార్య కూడా అనారోగ్యంతో బాధపడుతున్నారని, దస్తగిరి సైతం అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ పరిస్థితుల నేపథ్యంలో మనస్తాపానికి గురై ఆయన అఘాయిత్యానికి పాల్పడి ఉండవచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే మృతికి అసలు కారణం ఏమిటన్నది పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది. నిరుపేద కుటుంబానికి చెందిన దస్తగిరి మృతితో భార్య, పిల్లలు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. కుటుంబానికి పెద్ద దిక్కును కోల్పోయామని బంధువులు కన్నీరుమున్నీరవుతున్నారు. ప్రభుత్వం మానవతా దృక్పథంతో స్పందించి బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని, ఆర్థిక సహాయం అందించాలని స్థానికులు కోరుతున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించినట్లు సమాచారం. పోస్టుమార్టం నివేదిక, పోలీసుల దర్యాప్తు అనంతరం దస్తగిరి మృతికి సంబంధించిన పూర్తి వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

# ఘనంగా తెలంగాణ విమోచన దినోత్సవం

**- భాగ్యనగర్ తండా గ్రామపంచాయతీ కార్యాలయంలో జాతీయ జెండా ఆవిష్కరణ**



**కారేపల్లి, సెప్టెంబర్ 17 (భద్రాద్రి న్యూస్ రాములు):** తెలంగాణ విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకుని కారేపల్లి మండలం భాగ్యనగర్ తండా గ్రామపంచాయతీ కార్యాలయంలో గురువారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ బానోత్ హీరాలాల్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జాతీయ జెండాను ఆవిష్కరించి, తెలంగాణ విమోచన పోరాటంలో ప్రాణత్యాగాలు చేసిన యోధులను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ బానోత్ హీరాలాల్ మాట్లాడుతూ 1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనం అయిన చారిత్రక ఘట్టాన్ని గుర్తుచేసుకుంటూ తెలంగాణ విమోచన దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో విలీనం కావడానికి అనేక మంది పోరాటాలు, త్యాగాలు చేశారని, వారి త్యాగాలను నేటి తరం స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం, దేశ సమైక్యత కోసం జరిగిన పోరాటాల స్ఫూర్తిని యువతకు తెలియజేయాలని అన్నారు. దేశ ఐక్యతను కాపాడుతూ ప్రజలంతా సమష్టిగా అభివృద్ధి వైపు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

**ఘనంగా జాతీయ జెండా ఆవిష్కరణ**

కార్యక్రమంలో గ్రామపంచాయతీ ప్రజాప్రతినిధులు, సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొని జాతీయ జెండాకు గౌరవ వందనం సమర్పించారు. అనంతరం తెలంగాణ విమోచన దినోత్సవ ప్రాధాన్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు భీముడు పంచాయతీ సెక్రెటరీ అనిల్ కుమార్, ఉపసర్పంచ్, భీముడు వార్డు సభ్యులు, పంచాయతీ సిబ్బంది, రమేష్, రాందాస్, హాము, అంగన్‌వాడీ టీచర్లు, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# హమారా ప్రసాద్ ను అరెస్ట్ చేయడమే కాదు, ఉపా చట్టం నమోదు చేయాలి

**- జేబీపీ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ యెర్రా కామేష్**



**కొత్తగూడెం అర్బన్, సెప్టెంబర్ 17 (భద్రాద్రి న్యూస్) :** హమారా ప్రసాద్ ను తూతూ మంత్రంగా అరెస్ట్ చేసి చేతులు దులుపుకోవడం కాదని,అతనిపై ఊపా చట్టం కింద కేసు నమోదు చేయాలని జైభీమ్ రావ్ భారత్ పార్టీ (జేబీపీ) స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ యెర్రా కామేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని ఫంక్షన్ హాల్ నందు జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత ప్రపంచ మేధావి అంబేద్కర్ గారిని ప్రపంచమంతా మేధావిగా గుర్తించి ఆయన జయంతిని వరల్డ్ నాలెడ్జి డే గా ప్రకటిస్తే, అటువంటి మహనీయుడిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ, అంబేద్కర్ పై కల్పిత నాయకుడు పుస్తకాన్ని 18వ తేదీన ఆవిష్కరణ చేస్తానని ప్రకటించిన హమారా ప్రసాద్ పై గత కొంతకాలంగా తెలంగాణ రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో అంబేద్కర్ వాదులు, రాజకీయ పార్టీల నాయకులు పలు పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేసినా ప్రభుత్వం ముందే అరెస్టు చేయకపోవడం వల్ల సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో కల్పిత నాయకుడు పుస్తక ఆవిష్కరణకు పూనుకున్నాడని, ప్రభుత్వ అండదండలు లేకుండానే ఇంత సాహసానికి పూనుకున్నాడా అని ప్రశ్నించారు. ఇన్ని రోజులు అరెస్ట్ చేయకుండా ఇప్పుడు ప్రభుత్వం అరెస్ట్ చేయడం కాదని, అతనిపై ఊపా చట్టం కింద కేసు నమోదు చేసి బెయిల్ రాకుండా చేయాలని అంబేద్కర్ పై హమారా ప్రసాద్ అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నా కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు మౌనంగా ఉంటుందని ప్రశ్నించారు. ఆర్ఎస్ఎస్, బీజేపీ మతోన్మాదులు హమారా ప్రసాద్ తో అంబేద్కర్ కు వ్యతిరేకంగా మాట్లాడిస్తుంది వాస్తవం కదా అని నిలదీశారు. నిజంగా బీజేపీ వారికి సంబంధం లేకపోతే హమారా ప్రసాద్ అంశంపై మౌనంగా ఎందుకు ఉంటున్నారు బహుజన సమాజానికి సమాధానం చెప్పాలన్నారు. అంబేద్కర్ జీవించి ఉంటే గాంధీని గాడ్సే కాల్చిన విధంగా హమారా ప్రసాద్ అంబేద్కర్ ను చంపేవాడని అని వ్యాఖ్యలు చేసినా ప్రభుత్వం ఎందుకు ఊపా చట్టం కింద కేసు నమోదు చేయడం లేదని ప్రశ్నించారు. జైభీమ్ రావ్ భారత్ పార్టీ ప్రజా సంఘాల నుండి వస్తున్న వ్యతిరేకతతో ప్రభుత్వం అరెస్ట్ చేసినట్టు సమాచారం ఉందని అరెస్ట్ చేసిన హమారా ప్రసాద్ కు బెయిల్ రాకుండా కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గంధం మల్లికార్జునరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి మాలోత్ వీరు నాయక్, అసెంబ్లీ అధ్యక్షుడు నాగుల రవికుమార్, కిరణ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు

# మాదారం కాంగ్రెస్ గ్రామ అధ్యక్షులు కిలారి అప్పారావుకు మాతృవియోగం

**- కిలారి సుశీల మృతదేహానికి నివాళులర్పించిన మండల కాంగ్రెస్ అధ్యక్షులు తోటకూరి రాంబాబు**



**సింగరేణి, సెప్టెంబర్ 17 (భద్రాద్రి న్యూస్ రాములు ):** సింగరేణి మండలం మాదారం గ్రామ కాంగ్రెస్ శాఖ అధ్యక్షులు కిలారి అప్పారావు మాతృమూర్తి కిలారి సుశీల (వృద్ధాప్యం) గురువారం మాదారం గ్రామంలో మృతి చెందారు. విషయం తెలుసుకున్న సింగరేణి మండల కాంగ్రెస్ అధ్యక్షులు తోటకూరి రాంబాబు మాదారం గ్రామానికి చేరుకుని సుశీల భౌతికకాయాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, ఈ విషాద సమయంలో ధైర్యంగా ఉండాలని సూచించారు. సుశీల మృతి పట్ల మండల కాంగ్రెస్ కమిటీ తరఫున సంతాపం, కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ కిలారి సుశీల మృతి కుటుంబ సభ్యులకు తీరని లోటని, ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని కోరారు. కుటుంబ సభ్యులకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. సుశీల భౌతికకాయానికి నివాళులర్పించిన వారిలో మాదారం సర్పంచ్ ఉమా, మాజీ సర్పంచ్ నరేష్, జిల్లా కాంగ్రెస్ నాయకులు గుగులోత్ భీముడు నాయక్, గుడిపూడి తిరుమలరావు, కడియాల సుధాకర్, మండల కాంగ్రెస్ నాయకురాలు కిలారి లక్ష్మి, కుటుంబ సభ్యులు తదితరులు ఉన్నారు.

# అట్టడుగు వర్గాలకు అభివృద్ధి ఫలాలు కేసీఆర్‌తోనే సాధ్యం

**- పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు**



**కొత్తగూడెం అర్బన్, సెప్టెంబర్ 17 (భద్రాద్రి న్యూస్) :** అట్టడుగు వర్గాలకు సైతం అభివృద్ధి ఫలాలను అందించడం కేసీఆర్‌తోనే సాధ్యమని, తెలంగాణ అభివృద్ధే తెలంగాణ జాతిపిత కేసీఆర్ ఏకైక లక్ష్యం అని పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు అన్నారు. గురువారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో సెప్టెంబర్ 17 ను పురస్కరించుకుని జాతీయ జెండా, బీఆర్ఎస్ పతాకాన్ని ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు హరిప్రియ నాయక్, మచ్చ నాగేశ్వరరావు, తాటి వెంకటేశ్వర్లు, బీఆర్ఎస్ జిల్లా మాజీ అధ్యక్షుడు దిండిగల్ రాజేందర్, కొత్తగూడెం మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, నాయకులు రావులపల్లి రాంప్రసాద్, మానే రామకృష్ణ, లక్కినేని సురేందర్, కోసం నరసింహారావు, మంతపురి రాజు గౌడ్, అనుదీప్, సింధు తపస్వి, బొమ్మర్ల వరప్రసాద్, శివకృష్ణ పాల్గొన్నారు.

# వనజీవి రామయ్య లఘు చిత్రంలో విశ్వామిత్ర చౌహాన్



**కొత్తగూడెం అర్బన్, సెప్టెంబర్ 17 (భద్రాద్రి న్యూస్) :** పద్మశ్రీ అవార్డు గ్రహీత, వనజీవి రామయ్య జీవిత చరిత్ర ఆధారంగా తెరకెక్కుతున్న "వనజీవి రామయ్య" లఘు చిత్రంలో ప్రకృతి ప్రేమికుడు, వాక్ ఫర్ ట్రీస్ కార్యక్రమ నిర్వాహకుడు విశ్వామిత్ర చౌహాన్‌కు ప్రత్యేక పాత్ర లభించింది. హైదరాబాద్‌లోని తెలంగాణ ఫారెస్ట్ అకాడమీలో లఘు చిత్రం షూటింగ్ గురువారం నిర్వహించారు. ప్రముఖ సినీ నటుడు బ్రహ్మాజీ వనజీవి రామయ్య పాత్రలో కథానాయకుడిగా నటిస్తున్నారు. పర్యావరణ పరిరక్షణ, మొక్కల పెంపకంపై ప్రజల్లో అవగాహన కల్పించే ఇతివృత్తంతో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. షూటింగ్ సందర్భంగా చార్మినార్ సర్కిల్ సీసీఎఫ్ ప్రియాంక వర్గీస్, ఐఎఫ్ఎస్ ముఖ్య అతిథిగా పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా చిన్ననాటి నుండి ప్రతిరోజూ మొక్కలు నాటుతూ 1,568 రోజుల్లో 1,568 మొక్కలు నాటిన విశ్వామిత్ర చౌహాన్‌ను ఆమె ప్రత్యేకంగా అభినందించారు. వనజీవి రామయ్య స్ఫూర్తితోనే తాను ప్రతిరోజూ మొక్కలు నాటే కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నానని విశ్వామిత్ర చౌహాన్ తెలిపారు. వనజీవి రామయ్య జీవిత చరిత్ర ఆధారంగా తెరకెక్కుతున్న చిత్రంలో తనకు ప్రత్యేక పాత్ర లభించడం గర్వంగా ఉందన్నారు. పర్యావరణ పరిరక్షణకు తన వంతు కృషి చేస్తున్న విశ్వామిత్ర చౌహాన్‌కు లఘు చిత్రంలో ప్రత్యేక స్థానం కల్పించడం విశేషంగా నిలిచింది. ఈ చిత్రం త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది.

# మోదీ 76వ జన్మదినం సందర్భంగా సత్యసాయి ఆశ్రమంలో సేవా కార్యక్రమం




**కొత్తగూడెం అర్బన్, సెప్టెంబర్ 17 (భద్రాద్రి న్యూస్) :** భారతీయ జనతా పార్టీ కొత్తగూడెం పట్టణ అధ్యక్షుడు శీలం విద్యాసాగర్ ఆధ్వర్యంలో గౌరవనీయ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ 76వ జన్మదినం సందర్భంగా కొత్తగూడెం పట్టణంలోని సత్యసాయి ఆశ్రమంలో సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ్రమంలోని వారికి పండ్లు పంపిణీ చేసి, అనంతరం ఆశీర్వాద దీపం వెలిగించి ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీకి ఆయురారోగ్యాలు, సంపూర్ణ ఆరోగ్యం, దీర్ఘాయుష్షు కలగాలని ప్రార్థించారు. దేశ అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ చేస్తున్న కృషికి గుర్తుగా ఆయన జన్మదినాన్ని సేవా కార్యక్రమాలతో నిర్వహిస్తున్నామని శీలం విద్యాసాగర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శులు చంద్రగిరి రమేష్, కళ్యాణ్ కర్ రాజశేఖర్, జిల్లా సీనియర్ నాయకులు నోముల రమేష్, కనుకుంట్ల రాజమొగిలి, శ్రీనివాస్, రాయుడు నాగేశ్వరరావు, కొత్తూరు శ్రీనివాస్, కొయ్యడ శ్రీనివాస్ మహిళా నాయకులు బొందుగుల యామిని, గూడా విజయ, భూక్యా పూర్ణ, నిదానపల్లి అలివేలు, హాసిని, పట్టణ నాయకులు భాస్కర్ గౌడ్, గిరి, రవి, భారతీయ జనతా పార్టీ కార్యకర్తలు, మోదీ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# రాజకీయ నేతల భూదందాపై నిష్పక్షపాత విచారణ జరపాలి

**- అక్రమంగా ఆర్జించిన భూములను స్వాధీనం చేసి పేదలకు పంచాలి: సీపీఎం**

**కారేపల్లి, సెప్టెంబర్ 17 (భద్రాద్రి న్యూస్ రాములు):** భూ ఆక్రమణలు, ప్రభుత్వ భూముల అక్రమ స్వాధీనంపై అధికార, ప్రతిపక్ష నాయకులు పరస్పరం చేస్తున్న ఆరోపణలపై నిష్పక్షపాతంగా సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను నిగ్గు తేల్చాలని సీపీఎం ఖమ్మం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మెరుగు సత్యనారాయణ డిమాండ్ చేశారు. సింగరేణి మండలం చీమలపాడు గ్రామంలో మాలోత్ తావూరియా 28వ వర్ధంతి, వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట అమరవీరుల వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. పార్టీ మండల కమిటీ సభ్యుడు అజ్మీర శోభన్‌బాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సత్యనారాయణ మాట్లాడుతూ అసెంబ్లీ వేదికగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రతిపక్ష నాయకుల భూ వ్యవహారాలపై చేసిన వ్యాఖ్యలు, ప్రతిపక్ష నాయకులు అధికారపక్ష నాయకులపై చేసిన ఆరోపణలపై ప్రభుత్వం సమగ్ర విచారణ చేపట్టాలని కోరారు. ఆరోపణలు నిజమని తేలితే అక్రమంగా ఆర్జించిన భూములను స్వాధీనం చేసుకుని, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుని పేదలకు భూములు అందించాలని అన్నారు. అధికార, ప్రతిపక్ష పార్టీలు పరస్పరం ఆరోపణలు చేసుకోవడం మినహా అసెంబ్లీ సమావేశాల్లో ప్రజా సమస్యలపై తగిన స్థాయిలో చర్చ జరగలేదని విమర్శించారు. 22ఏ భూముల సమస్య, ఎరువుల కొరత, సాగునీటి ఇబ్బందులతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వాటి పరిష్కారానికి ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. రైతులు, వ్యవసాయ కార్మికులు, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపైనా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.

**సింగరేణి అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలి**

సీపీఎం మండల కార్యదర్శి కె. నరేంద్ర మాట్లాడుతూ జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నప్పటికీ ఏజెన్సీ మండలమైన సింగరేణి అభివృద్ధికి తగిన ప్రాధాన్యం లభించడం లేదన్నారు. విద్య, వైద్యం, సాగునీటి సౌకర్యాల కల్పనలో ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. సీతారామ ప్రాజెక్టు ద్వారా సింగరేణి మండలానికి సాగునీరు అందించేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజలను సమీకరించి పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు.

**అమరవీరులకు నివాళులు**

కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకుడు ఎర్రిపోతు భద్రయ్య పార్టీ జెండాను ఆవిష్కరించారు. అమరవీరుల చిత్రపటాలకు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. చీమలపాడు శాఖ కార్యదర్శి యనమనగండ్ల రవిబాబు, మండల కమిటీ సభ్యుడు వల్లబోయిన కొండలరావు, పాటిమీదగుంపు శాఖ కార్యదర్శి సూరపాక సర్వయ్య, సోషల్ మీడియా కన్వీనర్ ధరావత్ వినోద్‌కుమార్, నాయకులు రాసబంటి పుల్లయ్య, మన్నెం బ్రహ్మయ్య, పోతురాజు చందర్రావు, అజ్మీర రాందాస్, షేరు వెంకటేశ్వర్లు, రాచర్ల రణధీర్ తదితరులు




పాల్గొన్నారు.

# రిటైర్డ్ సింగరేణి ఉద్యోగి ద్వాలి దశదిన కర్మలు

**- కుటుంబాన్ని పరామర్శించిన నాయకులు, ప్రముఖులు.. మృతికి సంతాపం**



**కారేపల్లి, సెప్టెంబర్ 17 (భద్రాద్రి న్యూస్ రాములు):** కారేపల్లి మండలం భాగ్యనగర్ తండాకు చెందిన రిటైర్డ్ సింగరేణి ఉద్యోగి వాంకుడోత్ ద్వాలి ఇటీవల మృతి చెందారు. ఆయన దశదిన కర్మల కార్యక్రమాన్ని గురువారం కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు, గ్రామస్థుల సమక్షంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు, ప్రముఖులు హాజరై ద్వాలి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి మాజీ జెడ్పీటీసీ వాంకుడోత్ జగన్ నాయక్, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి ధారావత్ భద్రు నాయక్, వాంకుడోత్ సక్రూ, వాంకుడోత్ బన్సిలాల్, మునీరాం, గాంధీ, హరిలాల్, హరిరాం, సీతారాం తదితరులు హాజరయ్యారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వాంకుడోత్ ద్వాలి మృతి కుటుంబ సభ్యులు, బంధువులకు తీరని లోటని అన్నారు. సింగరేణి సంస్థలో ఉద్యోగిగా సేవలందించి పదవీ విరమణ అనంతరం కుటుంబంతో జీవించిన ద్వాలి మృతి పట్ల గ్రామస్థులు, బంధువులు సంతాపం వ్యక్తం చేశారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షిస్తూ కుటుంబ సభ్యులు ఈ విషాద సమయంలో ధైర్యంగా ఉండాలని సూచించారు. దశదిన కర్మల కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు, గ్రామ పెద్దలు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని వాంకుడోత్ ద్వాలికి ఘనంగా నివాళులర్పించారు.

# అమరవీరుల స్ఫూర్తితో.. ములుగులో భూ పోరాటం!

**- పేదలకు భూములు, ఇళ్ల స్థలాల కోసం ఉద్యమం ఉధృతం చేస్తాం: సీపీఎం జిల్లా కార్యదర్శి బీరెడ్డి సాంబశివ**

**వెంకటాపురం, సెప్టెంబర్ 17 (భద్రాద్రి న్యూస్)** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట అమరవీరుల స్ఫూర్తితో ములుగు జిల్లాలో పేదల భూమి, ఇళ్ల స్థలాల కోసం భూ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని సీపీఎం ములుగు జిల్లా కార్యదర్శి బీరెడ్డి సాంబశివ అన్నారు. గురువారం బోదాపురం గ్రామంలో సర్పంచ్ కొరస నరసింహారావు అధ్యక్షతన నిర్వహించిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వార్షికోత్సవ సభలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. భూమి కోసం.. భుక్తి కోసం.. పేద ప్రజల విముక్తి కోసం సాగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం భూస్వామ్య, జమీందారీ, జాగీర్దారీ దోపిడీ వ్యవస్థలకు వ్యతిరేకంగా జరిగిన చారిత్రక పోరాటమని సాంబశివ పేర్కొన్నారు. ఈ పోరాటం ద్వారా సుమారు 10 లక్షల ఎకరాల భూమి పేదలకు పంపిణీ జరిగిందని, వేలాది గ్రామాలకు ఉద్యమం విస్తరించిందని తెలిపారు.

**చరిత్రను వక్రీకరించొద్దు**

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రను వక్రీకరించి రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయని సాంబశివ ఆరోపించారు. ఈ పోరాటాన్ని కేవలం మతపరమైన పోరాటంగా చిత్రీకరించడం చారిత్రక వాస్తవాలను వక్రీకరించడమేనన్నారు. జమీందారులు, జాగీర్దారుల దోపిడీకి వ్యతిరేకంగా వివిధ కులాలు, మతాలు, ప్రాంతాలకు చెందిన ప్రజలు ఐక్యంగా పోరాడారని వివరించారు. ఆంధ్ర మహాసభ భాషా, సాంస్కృతిక రంగాల్లో ప్రజలను చైతన్యపరిచి, నాటి నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ప్రజా ఉద్యమానికి బాటలు వేసిందన్నారు. ఎర్రజెండా నాయకత్వంలో సాగిన పోరాటంలో




వేలాది మంది ప్రాణత్యాగాలు చేశారని, పేదలకు భూమి, సామాజిక న్యాయం కల్పించాలనే లక్ష్యంతో ఉద్యమం సాగిందని తెలిపారు.

**భూస్వామ్య దోపిడీకి వ్యతిరేకంగా పోరాటం**

తెలంగాణ రైతాంగ పోరాటంలో వివిధ వర్గాలకు చెందిన అనేక మంది ఉద్యమకారులు కీలక పాత్ర పోషించారని సాంబశివ గుర్తుచేశారు. షేక్ బందగీ, మఖ్దూం మొహియుద్దీన్, అర్షఫుల్లా ఖాన్, సోయబుల్లా ఖాన్, భీంరెడ్డి నరసింహారెడ్డి, మల్లు స్వరాజ్యం, అనభేరి ప్రభాకర్‌రావు, సింగిరెడ్డి భూపతిరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, చాకలి ఐలమ్మ, దొడ్డి కొమురయ్య, తాను నాయక్, ఆరుట్ల కమలాదేవి తదితరులు భూస్వామ్య దోపిడీకి వ్యతిరేకంగా పోరాడారని పేర్కొన్నారు.

పోరాటం అనంతరం కూడా కమ్యూనిస్టు కార్యకర్తలపై నిర్బంధం కొనసాగిందని, అనేక మంది జైళ్ల పాలయ్యారని తెలిపారు. తెలంగాణ రైతాంగ పోరాట స్ఫూర్తి దేశవ్యాప్తంగా అనేక రైతు, కార్మిక, ప్రజా ఉద్యమాలకు ప్రేరణగా నిలిచిందన్నారు.

**పేదలకు భూమి దక్కే వరకు పోరాటం**

ములుగు జిల్లాలో భూమిలేని పేదలకు భూములు, ఇళ్లులేని నిరుపేదలకు ఇళ్ల స్థలాలు కల్పించాలనే డిమాండ్‌తో రానున్న రోజుల్లో ఉద్యమాలను మరింత విస్తృతం చేస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి బీరెడ్డి సాంబశివ స్పష్టం చేశారు. పేదలకు భూమి, ఇళ్ల స్థలాల విషయంలో న్యాయం జరిగే వరకు ప్రజా పోరాటాలను కొనసాగిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి గ్యానం వాసు, మండల కమిటీ సభ్యులు కాపుల వెంకటేశ్వర్లు, పండా శీను, వెంకట నరసయ్య, కుంజ నారాయణ, పరిష్క కృష్ణ, రైతు నరసింహారావు, కొరస వీరవేణి, కురసం మల్లయ్య, వాదం బుచ్చయ్య, జయ, ఇరుప శీను, సోలో నరసింహస్వామి తదితరులు పాల్గొన్నారు.

# కోదాడలో ఈనెల 19 న మెగా జాబ్ మేళా: యువతకు ఉద్యోగ బాటలు



**కోదాడ, సెప్టెంబర్ 17 (భద్రాద్రి న్యూస్):** కోదాడ నియోజకవర్గ నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ఈ నెల 19న పట్టణంలోని సీసీ రెడ్డి విద్యా నిలయం ఆవరణలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు బానోతు ప్రతాప్ (రెండవ వార్డు, అజ్మీరా తండా గ్రామం, అనంతగిరి మండలం, సూర్యాపేట జిల్లా) తెలిపారు.రాష్ట్ర మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి సహకారంతో నిర్వహిస్తున్న ఈ మేళాలో సుమారు 200 నుండి 250 ప్రముఖ కంపెనీలు పాల్గొంటున్నాయి. ఇంజినీరింగ్, పాలిటెక్నిక్, డిగ్రీ, ఐటీఐ అర్హతలు గల అభ్యర్థులకు కంపెనీ ప్రతినిధులు నేరుగా ఇంటర్వ్యూలు నిర్వహించి ఉద్యోగాలు కల్పిస్తారని వెల్లడించారు. నిరుద్యోగ యువత ఈ సువర్ణావకాశాన్ని సద్వినియోగం చేసుకుని, ఇంటర్వ్యూలకు పెద్ద సంఖ్యలో హాజరై ఉద్యోగాలు సాధించాలని ఆయన పిలుపునిచ్చారు.

# రాష్ట్ర విమోచన దినోత్సవం జాతీయ జెండా ఆవిష్కరణ

**- కాంగ్రెస్ ప్రభుత్వంప్రజా పాలన లో అందరికీ సంక్షేమ ఫలాలు**

**- మండల కాంగ్రెస్ పార్టీ శ్రేణులు**



**కామేపల్లి,సెప్టెంబర్ 17 (భద్రాద్రి న్యూస్):** కామేపల్లి మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గుజ్జర్లపూడి రాంబాబు ఆధ్వర్యంలో గురువారం తెలంగాణ రాష్ట్ర విమోచన దినోత్సవంను ఘనంగా జరుపుకోవడం జరిగింది ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజా పాలన ప్రభుత్వంలో రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి చేస్తున్న సంక్షేమానికి పేద ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు అందే విధంగా కార్యచరణ ప్రాణాలిక ఉపాధించి అందరికీ సకాలంలో అన్ని విధాల ఆదుకునేందుకు శ్రీకారం చూపుతున్నారని ఈ అవకాశాన్ని బడుగు బలహీన పేద బీద సామాజిక వర్గానికి చెందిన ప్రతి కుటుంబ ప్రజలు ఈ సంక్షేమ ఫలాలను అందించే విధంగా కృషి చేస్తున్నారని. ఆయన అన్నారు. ఎన్నో తరాలుగా వెనుకబడి ఉన్న మన తెలంగాణ రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ కృషిచేసి సహకరించాలని. అభివృద్ధి వైపు ప్రతి అడుగులు ముందుకు వేయాలని వారు అన్నారు. అనంతరం కామేపల్లి మండల సమస్యలపై సూదుర్గంగా చర్చించి సమస్యలను కామేపల్లి మండలం కాంగ్రెస్ నాయకులు.

మండల అధ్యక్షులు. గుజ్జర్లపూడి రాంబాబు తో పాటు మండల జిల్లా నాయకులు తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు మల్లు భట్టి విక్రమార్కని ముదిగొండ మండలం బాణాపురం గ్రామం లో మర్యాదపూర్వకంగా కలిసి.మండల పాలు సమస్యలపై వినయంగా వివరించడం జరిగింది. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించి మీ మండల సమస్య లను త్వరలో పరిష్కార చూపుతానని ఉన్నారు అలాగే ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు.నూతి సత్యనారాయణ గౌడ్.కామేపల్లి మండల నాయకులు కామేపల్లి సొసైటీ అధ్యక్షులు. ఓ బి సి జిల్లా అధ్యక్షులు. టి పి సి సి మేంబర్. పుచ్చకాయల వీరభద్రం.డిసిసి సెక్రటరీ ఫతే







మహమ్మద్.కాంగ్రెస్ జిల్లా నాయకులు తోటకూరి శివయ్య. కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# భజ్యతండాలో ఘనంగా ప్రజాపాలన దినోత్సవం

**- జెండా ఆవిష్కరించిన సర్పంచ్ హనుమంతరావు.. అనంతరం స్వేచ్ఛా ర్యాలీ**







**భజ్యతండా, సెప్టెంబర్ 17 (భద్రాద్రి న్యూస్ రాములు ):** తెలంగాణ రాష్ట్ర ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని ఖమ్మం జిల్లా సింగరేణి మండలం భజ్యతండా గ్రామపంచాయతీ కార్యాలయంలో గురువారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ సర్పంచ్ వాంకుడోత్ హనుమంతరావు జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామపంచాయతీ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులతో కలిసి స్వేచ్ఛా ర్యాలీ నిర్వహించారు. దేశ స్వాతంత్ర్య స్ఫూర్తి, ప్రజాస్వామ్య విలువలు, ప్రజాపాలన ప్రాధాన్యతను చాటుతూ ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా సర్పంచ్ వాంకుడోత్ హనుమంతరావు మాట్లాడుతూ ప్రజల భాగస్వామ్యంతోనే సమర్థవంతమైన ప్రజాపాలన సాధ్యమవుతుందని అన్నారు. గ్రామాల అభివృద్ధిలో ప్రజలు చురుకైన భాగస్వాములు కావాలని, ప్రజాపాలన ద్వారా గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి దారావత్ జ్యోతి, జిల్లా నాయకులు అజ్మీరా హేమ్లా, విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామపంచాయతీ సిబ్బంది, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by CHENGAPONGUSAIDULU,and printed at KAKATI BABU PRINTERS H No.4-10.Telagarama varam,Laximidevipally, Kothagudem -507101,Dist .Bhadradri kothagudem, Telangana. And Published At HNo. DA-416,Babu camp,chunchupalli (M), Kothagudem-507101,Dist Bhadradri kothagudem, Telangana.Editor: CHENGAPONGU SAIDULU. RNI TELTEL 2023/90682Call No.6302329046